

ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

# వ్యవసాయం


వ్యవసాయ సచిత్ర మాస పత్రిక

సంపుటి - 14    సంచిక - 01    జనవరి 2022    పేజీలు - 44    వెల రూ. 20/-



మిరపలో సస్యరక్షణ






మామిడి పూత
మరియు
కాయ దశలలో సస్య రక్షణ



శనగ పంటలో తెగుళ్ళు



పాల కల్తీ - నిర్ధారణ

# ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయములో జరిగిన

# వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక




వ్యవసాయ విద్యా దినోత్సవం
@ విశ్వవిద్యాలయ ప్రాంగణం, లాం.



యఫ్.యం.సి. ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మరియు
ఎ.ఎన్.జి.ఆర్.ఎ.యు. అవగాహన ఒప్పంద
కార్యక్రమం @ పరిపాలనా భవనం, లాం.



యు.ఎస్.ఎ. రాయబార కార్యాలయ వ్యవసాయ
మంత్రి సలహాదారు సందర్శన
@ పరిపాలనా భవనం, లాం.



డా॥ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి
@ పరిపాలనా భవనం, లాం.



శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి
@ పరిపాలనా భవనం, లాం.



72వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు
@ పరిపాలనా భవనం, లాం.

ANGRAU

# వ్యవసాయం

శ్రీ ప్లవనామ సం॥ మార్గశిర
మాస బ.చతుర్దశి మొ॥
పుష్యమాస చతుర్దశి వరకు

## సంపాదక వర్గం

ప్రధాన సంపాదకులు
**డా॥ ఎ. లలిత**
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి (ఎఫ్.ఎ.సి.)

సంపాదకులు
**డా॥ యం. వెంకటరాముడు**
శాస్త్రవేత్త (విస్తరణ)

వ్యవసాయం మాస పత్రిక
సంవత్సర చందా రూ. 200/- లేదా
జీవితకాల (10 సంవత్సరములు) చందా
రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి.
రూపంలో చెల్లించవచ్చు.
మని ఆర్డర్ లేదా డి.డి అయితే PRINCIPAL AGRICULTURAL INFORMATION OFFICER, GUNTUR, ANDHRA PRADESH పేరిట తీసి గుంటూరులో చెల్లేవిధంగా పంపించాలి.

చిరునామా :
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము
అడ్వాన్స్‌డ్ పోస్టు గ్రాడ్యుయేషన్ సెంటర్ ఆవరణ,
లాం, గుంటూరు - 522 034, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 91005 00223
ఈ-మెయిల్ : paio@angrau.ac.in

## విషయ సూచిక

1. ఉపకులపతి సందేశం ....... 5
2. విస్తరణ సంచాలకుల సందేశం ....... 6
3. వివిధ పంటలలో ఈ మాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు ....... 7
4. సాంకేతిక వ్యాసాలు
▶ రబీ వరిలో కలుపు యాజమాన్యం ....... 19
▶ వ్యవసాయ పరిశోధనా స్థానం, నెల్లూరి వారి నూతన సన్నగింజ వరి రకం ఎన్.ఎల్.ఆర్. 4001 (నెల్లూరి సిరి) ....... 21
▶ నువ్వు పంట సాగులో మెళకువలు ....... 23
▶ వై.యస్.ఆర్. ఉచిత పంట భీమా - వ్యవసాయ అభివృద్ధి ....... 25
▶ శనగ పంటను ఆశించే తెగుళ్ళు మరియు వాటి యాజమాన్యం ....... 29
▶ మిరప పంటలో సస్యరక్షణ చర్యలు ....... 31
▶ మామిడి పంటలో పూత మరియు కాయ దశలలో తీసుకోవల్సిన సస్యరక్షణ చర్యలు ....... 33
▶ ఆంధ్రప్రదేశ్ లోని వాతావరణ మండలాలు మరియు జిల్లాల వారిగా 2021 నైఋతి ఋతుపవనాల ద్వారా విచ్చేసిన వర్షపాతం తద్వారా వివిధ ఆయకట్టలోనికి విచ్చేసిన నీటి నిల్వలు మరియు పంటల సాగు విస్తరణ ....... 36
▶ తెల్లవన్ని పాలు కావు : పాల కల్తీ - నిర్ధారణ ....... 38
5. విశ్వవిద్యాలయ వార్తలు ....... 40
6. రైతుల సమస్యలు - శాస్త్రవేత్తల సలహాలు ....... 41

పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను
తమ అమూల్యమైన సలహాలను, సూచనలను అందచేయవలసిందిగా కోరుచున్నాము.

# జనవరి మాసం క్యాలెండర్ - 2022

| SUN ఆది | MON సోమ | TUE మంగళ | WED బుధ | THU గురు | FRI శుక్ర | SAT శని |
|---|---|---|---|---|---|---|
| 30 [illegible] | 31 [illegible] | * | * | * | * | 1 [illegible] |
| • 2 [illegible] | 3 [illegible] | 4 [illegible] | 5 [illegible] | 6 [illegible] | 7 [illegible] | 8 [illegible] |
| 9 [illegible] | 10 [illegible] | 11 [illegible] | 12 [illegible] | 13 [illegible] | 14 [illegible] | 15 [illegible] |
| 16 [illegible] | ○ 17 [illegible] | 18 [illegible] | 19 [illegible] | 20 [illegible] | 21 [illegible] | 22 [illegible] |
| 23 [illegible] | 24 [illegible] | 25 [illegible] | 26 [illegible] | 27 [illegible] | 28 [illegible] | 29 [illegible] |

**పూర్వాషాఢ-ఉత్తరాషాఢ కార్తెలు(29.12.21 నుండి 23.01.22)**

| | | |
|---|---|---|
| వరి | : | తాలీ లేక దాళ్వా వరి నాట్లు, డిసెంబర్‌లో వరికి కలుపు తీయుట, సస్యరక్షణ |
| జొన్న | : | సంకర జొన్నకు నేలను తయారు చేయుట, విత్తనం వేయుట |
| సజ్జ | : | వేసవి పంటకు నేల తయారి-విత్తనం వేయుట |
| ప్రత్తి | : | మాగాణి ప్రత్తికి నేలను తయారు చేయుట |
| మొక్కజొన్న | : | ఎరువులు వేయుట. అంతర కృషి |
| వేరుశనగ | : | డిసెంబరులో విత్తిన వేరుశనగకు అంతర కృషి |
| ఆముదం | : | విత్తుట |
| చెఱకు | : | కోస్తారాయల సీమల్లో క్రొత్త తోటలను నాటుట |
| పప్పు దినుసులు | : | వరి పొలాలందు (మాగాణిలో) నవంబరులో వేసిన మినుము, పెసర కోతలు |
| పశుగ్రాసాలు | : | లూసర్న్, బర్సీము కోతలు, వేసవి పశుగ్రాసాల సాగు |

**శ్రవణ కార్తె (24.01.22 నుండి 05.02.22)**

| | | |
|---|---|---|
| వరి | : | ముందు నాటిన వరికి ఎరువులు వేయుట, సస్యరక్షణ |
| జొన్న | : | రబీజొన్న కోతలు - వేసవి రకాలను విత్తుట |
| పప్పుదినుసులు | : | ఉలవ కోతలు |
| వేరుశనగ | : | డిశంబరులో విత్తిన పంటకు సస్యరక్షణ |
| ప్రత్తి | : | వరి పొలాల్లో వేసిన ప్రత్తికి కలుపు తీయుట, పైరును పలుచన చేయుట |
| ధాన్య నిల్వలు | : | విత్తనాలు, నిల్వ చేసుకొనుటలో జాగ్రత్తలు తీసుకొనుట, నిల్వ ఉంచిన ధాన్యానికి పురుగు పట్టకుండా శాస్త్రీయ పద్ధతులను పాటించుట |

# మార్కెట్ ఇంటలిజెన్స్ - అధిక ఆదాయానికి మార్గం



డా॥ ఏ. విష్ణువర్ధన రెడ్డి
ఉపకులపతి
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

హరిత విప్లవం తర్వాత భారతదేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావటం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి, పెరుగుతున్న జనాభా ఆహార మరియు పోషకావసరాలను తీర్చగలుగుతుంది. కానీ సరియైన మార్కెటింగ్ సదుపాయాలు, మార్కెట్ సమాచార లభ్యత లేకపోవటం మరియు మార్కెట్ ఇంటలిజెన్స్‌ను అనుకున్న రీతిన వినియోగించుకోలేకపోవడం వలన రైతాంగం ఆశించిన మేర ఆదాయాన్ని ఆర్జించలేకపోవటం జరుగుతున్నది.

మార్కెట్ ఇంటలిజెన్స్ అంటే ప్రాథమికంగా గత మరియు ప్రస్తుత పోకడల ఆధారంగా భవిష్యత్ ధరలను అంచనావేయడం. మార్కెట్ ఇంటలిజెన్స్ ద్వారా మార్కెట్ ప్రవర్తనను గుర్తించి ఏరకమైన పంటను పండించాలి, ఎప్పుడు విక్రయించాలి మరియు ఏ మార్కెట్‌లో విక్రయించాలి అనే కీలక విషయాలలో సరియైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశాలు మెరుగవుతాయి. మార్కెట్ ఇంటలిజెన్స్ ప్రధానంగా నాలుగు అంశాలపై ఆధారపడి ఉంటుంది. మొదటిది-ధర (గత మరియు ప్రస్తుత సమాచారంతో భవిష్యత్ ధరలను అంచనా వేయటం), రెండవది – వస్తువు (నాణ్యత మరియు ముఖ్య లక్షణాలు), మూడవది – స్థలం (ఏ మార్కెట్‌లో అధిక ధర పలుకుతుంది), నాలుగవది – సమయం (ఏ సమయంలో అధిక ధర పలుకుతుంది). మార్కెట్ ఇంటలిజెన్స్ కొరకు కావలసిన క్రమబద్ధమైన సమాచారాన్ని రైతులు, వ్యాపారులు, వార్తాపత్రికలు, సామాజిక మీడియా మరియు వినియోగదారులు నుంచి సంగ్రహించి విశ్లేషించడం ద్వారా వ్యవసాయ రంగంలో కీలక నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశాలుంటాయి.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతాంగం శ్రేయస్సు దృష్ట్యా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం లో మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ప్రారంభించడం జరిగింది. ఈ కేంద్రం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో పండిస్తున్న అన్ని ముఖ్యమైన పంటల (ప్రత్తి, మిరప, పసుపు, మొక్కజొన్న, జొన్న, కంది, మినుము, పెసర, శనగ మరియు వేరుశనగ) ధరలను సేకరించి, విశ్లేషించి సంబంధిత సమాచారాన్ని, మార్కెట్ పోకడలను మరియు ధరలను ముందస్తుగా సూచించడం జరుగుతుంది. పంటలు విత్తే ముందు మరియు కోత కోసే సమయానికి వర్షాకాలం మరియు యాసంగి రెండు కాలాలలో రైతులకు ఈ సమాచారం అందించడం జరుగుతుంది. ఈ సమాచారం పంట సరళిని నిర్ణయించుటకు, కోసిన పంటను నిల్వ చేయాలా లేదా ఏ సమయంలో, ఏ మార్కెట్‌లో విక్రయించాలో మొదలగు నిర్ణయాలు తీసుకోవడానికి దోహదకారిగా ఉండగలదు. రైతాంగం ఈ కేంద్రం ద్వారా ప్రస్తుత మరియు భవిష్యత్ ధరలను తెలుసుకొని వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవాలి.

వ్యవసాయరంగాభివృద్ధికి సమర్థవంతమైన మార్కెట్ ఇంటలిజెన్స్ అవసరం. మన రైతాంగం అందుబాటులో ఉన్న మార్కెటింగ్ ఇంటలిజెన్స్‌ని ఉపయోగించుకొని అధిక ఆదాయాన్ని పొందగలరని ఆశిస్తున్నాను.

(ఏ. విష్ణువర్ధన రెడ్డి)

# మార్కెట్ సమాచారం... లాభసాటి వ్యవసాయానికి ఆధారం



**డా॥ పి. రాంబాబు**
విస్తరణ సంచాలకులు
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కువ మంది వ్యవసాయం మరియు అనుబంధ రంగాలపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. రాష్ట్ర రైతాంగం ఆశించిన దిగుబడులను సాధిస్తున్నా వివిధ కారణాల వలన అనుకున్నంత ఆదాయాన్ని గడించలేని స్థితిలో ఉన్నారు. అధిక ధరలు పలికే పంటలు, వాటి యాజమాన్య పద్ధతులు ముఖ్యంగా మార్కెట్ల గురించి సరైన అవగాహన లేకపోవడం వలన ఈ పరిస్థితులను చవిచూడాల్సి వస్తున్నది.

ఇలాంటి పరిస్థితుల నుండి బయటపడాలంటే రైతాంగం మార్కెట్‌పై పూర్తి అవగాహన పెంచుకొని ప్రణాళికాబద్ధంగా సేద్యం చేపట్టాలి. మార్కెట్‌లో అన్ని వస్తువుల ధరలు వాటి సరఫరా మరియు గిరాకీ మీదే ఆధారపడి ఉంటుంది. కనుక రైతాంగం పంటల ప్రణాళికలను తయారు చేసుకొనే ముందే వారు పండించే ఉత్పత్తులకు ఏయే మార్కెట్లలో అధిక ధర పలుకుతుందో, వాటి సరఫరా, గిరాకీ, నాణ్యత ప్రమాణాల గురించి సరైన అవగాహన కలిగి ఉండాలి. ఒక్కోసారి అధిక దిగుబడులను సాధించినా మార్కెట్లో ఆశించిన ధరలు దక్కకపోతే విలువ జోడింపులతో మెరుగైన ధరను పొందే అవకాశాలపై కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు శిక్షణా కార్యక్రమాలను చేపడుతున్నారు. మన పొరుగునున్న మహారాష్ట్ర, కర్ణాటకలతో పాటు పంజాబ్, హర్యాన మరియు గుజరాత్ రైతులు ఉత్పత్తిదారుల సహకార సంఘాలుగా ఏర్పడి వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా మలచి, వారు పండించిన ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మన రైతులు సంఘటితమై ఆ దిశగా కదలాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మన కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమార్థం ఎన్నో నూతన పథకాలను అందుబాటులోకి తెచ్చింది. వాటిలో నూతన గోదాముల నిర్మాణం, ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ విధానాలు, ఆహారశుద్ధి పరిశ్రమలను నెలకొల్పడం, దేశంలో ప్రధాన మార్కెట్లను జాతీయ వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానించడం మొదలగునవి ఉన్నాయి. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో పండిస్తున్న ముఖ్యమైన పంటలకు ప్రతి సీజన్‌లో రెండు సార్లు, విత్తే ముందు మరియు కోతకు ముందు ముందస్తు ధరల అంచనాలను, విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ మరియు వ్యవసాయ మాసపత్రిక ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాము.

రాష్ట్ర రైతాంగం సేద్యంలో ఆధునిక మెళకువలతో పాటు, మార్కెట్ సమాచారం, సాగు ఖర్చు తగ్గించుకునే మార్గాలు, విలువల జోడింపులపై సరైన అవగాహనను పెంచుకుంటూ, తమ శక్తి యుక్తులతో ప్రణాళికాబద్ధంగా లాభసాటి వ్యవసాయాన్ని చేపడతారని కోరుకుంటున్నాను.

(పి. రాంబాబు)




**వరిగడ్డి కాల్చకుండా వుండుటకు మెళకువలు :**

- సార్వా కోసిన వెంటనే దాళ్వా వేసే రైతాంగం దమ్ము త్వరగా అవ్వాలని గడ్డి తగలబెడుతున్నారు. దీని వలన వాతావరణ కాలుష్యం ఏర్పడటమే గాక, భూసారాన్ని పెంచే సూక్ష్మజీవులు చనిపోతున్నాయి. అంతేకాకుండా బూడిద నేలలోని సూక్ష్మరంధ్రాలను మూసివేయటం వలన నేలకు అందించిన పోషకాలు, నీరు సరిగా అందవు. కాబట్టి వరిగడ్డిని తగులబెట్టకుండా, భూమిలో కలియదున్నాలి. ఎకరానికి వచ్చే గడ్డి భూమిలో కలియ దున్నితే 12 కిలోల నత్రజని, 5 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాష్ పైరుకు పోషకాలుగా ఉపయోగపడతాయి. గడ్డి వేగంగా కుళ్ళటానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను వేస్తూ దానికి 10 కిలోల యూరియా కలుపుకోవాలి.

**మురగ దమ్ముతో లాభాలు :**

- సార్వా కోసిన వెంటనే దాళ్వాకు వెళ్ళే ముందు తప్పని సరిగా మురగదమ్ము చేయాలి. మురగదమ్మును కూడా వారం 10 రోజుల వ్యవధిలో ఖచ్చితంగా మూడు సార్లు చేయాలి. దీని వలన సార్వాలో మిగిలిన మోళ్ళు, కలుపు వంటి పనికిరాని పదార్థాలన్నీ పూర్తిగా కుళ్ళిపోతాయి. అంతేకాకుండా సార్వాలో పండిన వరి కేళీలు, దాళ్వాలో మొలవకుండా వుంటాయి. మొదటి మురగ దమ్ములో 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌కు 10 కిలోల యూరియా కలిపినట్లయితే వ్యర్థ పదార్థాలు త్వరగా కుళ్ళుతాయి.

**దాళ్వా వరి నాటేటప్పుడు తీసుకోవలసిన మెళకువలు :**

- లేత వయసున్న నారు (20-25 రోజులు) చదరపు మీటరుకు 44 మూనలు వుండేటట్లు పైపైన నాటుకోవాలి.
- కాలిబాటలు ప్రతి 2-3 మీటర్లకు విధిగా వుండేటట్లు చూసుకోవాలి.
- ప్రధాన పొలమును 3-4 సార్లు దమ్ము చేసి బాగా చదును చేసి నాటుకోవాలి. మిషన్‌తో నాట్లు వేసేటప్పుడు 16-18 రోజుల వయసున్న నారును నాటుకోవాలి.

**ఎరువుల యాజమాన్యం :**

- సిఫారసు చేసిన ఎరువులు ఎకరాకు 72:36:24 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్‌ను ఇచ్చు ఎరువులతో పాటు 10 టన్నుల పశువుల ఎరువు వేసుకోవడం వలన వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చు.
- సిఫారసు చేసిన భాస్వరం ఎరువును విధిగా నాట్లకు ముందుగా వేసుకోవడం వలన త్వరగా మూన తిరిగి ఎక్కువ దుబ్బు చేస్తుంది. ఏ వరి సాగు పద్ధతికైనా భాస్వరం ఎరువును దమ్ములోనే వేసుకోవాలి.
- దమ్ములో భాస్వరం ఎరువును వేయని నేపధ్యంలో ఊడ్చిన వెంటనే (5 రోజులలోపు) డి.ఎ.పి. రూపంలో గాని లేదా కాంప్లెక్స్ ఎరువుల రూపంలో అందించవచ్చు. కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా పిలకల దశలో, అంకురం ఏర్పడే దశలో వేయరాదు.
- నాటు పద్ధతిలో సిఫారసు చేసిన నత్రజనిని మూడు సమ భాగాలుగా మొదటిసారి నాటడానికి ముందు, రెండవసారి పిలక దశలో, మూడవసారి అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి. పొటాష్ ఎరువును సగం మొదటి దఫాలో మరియు మిగతా సగం అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి.
- వెదజల్లు పద్ధతిలో మొదటి దఫా నత్రజని ఎరువును విత్తిన 15 రోజులకు, రెండవసారి విత్తిన 40 రోజులకు, ఆఖరిసారి విత్తిన 60 రోజులకు పొటాష్ ఎరువుతో కలిపి వేసుకోవాలి.
- మిషన్ ఊడ్పులో నత్రజని ఎరువును మొదటి సారి ఊడ్చిన వెంటనే, రెండవ దఫా ఊడ్చిన 20 రోజులకు, మూడవ దఫా ఊడ్చిన 40 రోజులకు వేసుకోవాలి.

**నాటిన పొలంలో కలుపు యాజమాన్యం :**

- ప్రధాన పొలంలో కలుపు నివారణకు నాట్లు వేసిన 3-5 రోజుల లోపు పల్చగా నీరు పెట్టి 25 కిలోల పొడి ఇసుకలో ఎకరానికి 1.5 లీటర్లు బుటాక్లోర్ లేదా 500 మి.లీ. ప్రిటిలాక్లోర్ లేదా ఆక్సాడయర్జిల్ 35-50 గ్రా. లేదా బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ + ప్రిటలాక్లోర్ గుళికలు 4 కిలోలు చొప్పున సమానంగా పడేలా చల్లాలి. కలుపు మందు వేసినపుడు పలచగా నీరు వుండేటట్లు నీరు నిలబెట్టాలి.
- ఊడ్చిన 15-20 రోజులకు గడ్డిజాతి కలుపు మొక్కలు

ఎక్కువ వున్నట్లయితే సైహలోఫప్ బ్యుటైల్ 10% ద్రావకం 2 మి.లీ. ఒక లీటరు నీటికి లేదా బిస్పైరిబాక్ సోడియం 10% ద్రావకం లీటరు నీటికి 0.4 మి.లీ. చొప్పున కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలి. వెడల్పాటి ఆకులున్న కలుపు మొక్కలున్నట్లయితే నాటిన20-25 రోజులలోపు ఎకరానికి 400 గ్రా. 2,4 డి. సోడియం సాల్ట్ 80% పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

### వెదజల్లు పద్ధతిలో కలుపు యాజమాన్యం :

- వెదజల్లు పద్ధతిలో కలుపు నివారణకు విత్తిన 3-5 రోజుల మధ్య ఎకరానికి ఆక్సాడయర్జిల్ 35 గ్రా. 25 కిలోల పొడి ఇసుకతో కలిపి సమానంగా పడేలా చల్లాలి. విత్తిన 8-10 రోజుల మధ్య ఎకరానికి పైరాజోసల్ఫ్యూరాన్ ఇథైల్ లీటరు నీటికి 80 గ్రా. లేదా ఇథాక్సిసల్ఫ్యూరాన్ 40 గ్రా. 200 లీటర్ల నీటితో కలిపి పొలంలో పిచికారి చేయాలి.
- విత్తిన 20 రోజులకు ఎకరానికి సైహలోఫాప్ బ్యుటైల్ 10% ద్రావకం 400 మి.లీ. లేదా బిస్పైరిబాక్ సోడియం 10% ద్రావకం 100 మి.లీ. చొప్పున ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలి.
- వెడల్పాటి ఆకులున్న కలుపు మొక్కలున్నట్లయితే విత్తిన 20-25 రోజులలోపు ఎకరానికి 400 గ్రా. 2,4 డి. సోడియం సాల్ట్ 80% పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

### జింకు లోప నివారణ :

- దాళ్వాలో చలి ఎక్కువగా వుండటం వలన జింకు మొక్కకు అందుబాటులో వుండదు. నారుమడిలో ఆకుల మీద తుప్పు మచ్చలు కనిపిస్తే జింకు లోపంగా గుర్తించి లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ 5 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.
- ప్రధాన పొలంలో ఎకరానికి 20 కిలోలు జింకు సల్ఫేట్ ఆఖరి దమ్ములో వేసుకోవాలి. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ మరియు జింక్ సల్ఫేట్ కలిపి వేయరాదు. ఈ రెండింటికి మధ్య కనీసం 24 గంటల వ్యవధి వుండాలి.
- ప్రధాన పొలంలో ఆకు ఈనెల మీద తుప్పు మచ్చలు వుండి మొక్క గిడసబారిపోయి ఎరువులు వేసినా కూడా ఎదగక పోయినపుడు జింకు లోపంగా నిర్ధారించుకుని ఒక లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ 5 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.

### సస్యరక్షణ :

- జనవరి నెలలో చలి ఎక్కువగా ఉండటం వలన అగ్గి తెగులు తట్టుకోలేని రకాలు సాగు చేసినప్పుడు అగ్గి తెగులు ఆశించవచ్చు. అలాగే కాండం తొలిచే పురుగు, తాటాకు పురుగు (హిస్పా) ఆశించవచ్చు. దాళ్వా వరిలో ఎలుకల నివారణకు సమగ్ర ప్రణాళిక రచించుకోవలసిన ఆవశ్యకత వున్నది.
- అగ్గి తెగులు నివారణకు లీటరు నీటికి ట్రైసైక్లోజోల్ 75% 0.6 గ్రా. లేదా ఐసోప్రోథియోలిన్ 40%, 1.5 మి.లీ. లేదా కాసుగామైసిన్ 3 ఎల్. 2.5 మి.లీ. కలిపి పిచికారి చేసుకోవాలి. అగ్గితెగులు ఆశించినప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టకుండా నత్రజని ఎరువును వేయరాదు.
- కాండం తొలుచు పురుగు నివారణకు లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ. కలిపి పిచికారి చేసుకోవాలి. చిరు పొట్ట దశలో ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు 8 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలు 10 కిలోలు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 4 జి గుళికలు 4 కిలోలు వేసుకోవాలి.
- తాటాకు పురుగు (హిస్పా) నివారణకు లీటరు నీటికి ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. కలిపి పిచికారి చేసుకోవాలి.
- ఎలుకల నివారణకు ఎలుక కన్నాలలో పోగబారించుకోవాలి. ఎకరానికి 20 చొప్పున ఎలుక బుట్టలు పెట్టుకోవాలి. బ్రోమోడయోలిన్ ఎర ఎలుకల మందు 10-15 గ్రా. ఒక కన్నానికి చొప్పున (96 పాళ్ళు నూకలు, 2 పాళ్ళు నూనె, 2 పాళ్ళు మందు) పొట్లాలుగా కట్టి కన్నానికి ఒకటి చొప్పున వేసుకోవాలి. ఈ మందును రైతులు సామూహికంగా 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పైరు చిరుపొట్ట దశకు వచ్చే లోపే ఎలుక కన్నాలలో పెట్టుకోవడం వలన ఎలుకలను సమర్థవంతంగా అరికట్టవచ్చు.

**డా॥ టి. శ్రీనివాస్,** ప్రధాన శాస్త్రవేత్త (వరి)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
మారుటేరు - 534 122. చరవాణి : 98853 92215




ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్తి పంటలో అన్ని జిల్లాలలో కూడా నవంబరు మాసంలో ఎడతెరపి లేకుండా కురిసిన అధిక వర్షాల వల్ల అన్ని రకాల ఆకుమచ్చ తెగుళ్ళు, తుప్పు తెగులు మరియు బూజు / మజ్జిగ తెగులు అధికంగా ఆశించినట్లుగా గమనించ డమైనది.

**బూజు తెగులు :** ఈ తెగులు నవంబరు నుండి జనవరి మాసాల్లో మంచు కురవటం మరియు రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పుడు వృద్ధి చెందుతుంది. ఆకుల మీద కోణాకారపు తెల్లటి మచ్చలు ఏర్పడి, శిలీంధ్ర బీజాలు ఆకుల అడుగు భాగాన ఏర్పడతాయి. ఉధృతిని బట్టి ఆకుల పైభాగాన కూడా వ్యాపించి ఆకులు పసుపు రంగులోకి మారి, ఎండుబారి రాలిపోతాయి. ఈ తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా కార్బండెజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు పైరు తడిచేలా పిచికారి చేయాలి.

ఆకుమచ్చలు మరియు తుప్పు తెగులు నివారణకు 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

అంతేకాకుండా పెరుగుదల దశలో ఉన్న కాయలలో పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో గులాబి రంగు పురుగు ఉధృతి పెరిగినట్లుగా గమనించడమైనది.

**నివారణ చర్యలు :**

- ఆర్థిక సహన స్థాయిని పాటిస్తూ మందులను పిచికారి చేయాలి.
- అవసరాన్ని బట్టి ప్రొఫెనోఫాస్ 50% ఇ.సి. 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 75% డబ్ల్యు.పి. 1.5 గ్రా. లేదా సైపర్‌మెత్రిన్ 25% ఇ.సి. 1 మి.లీ. లేదా లాంబ్డా సైహలోత్రిన్ 5% ఇ.సి. 1 మి.లీ. లీటరు నీటితో కలిపి పంటపై వారం రోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి.

పైన సూచించిన సస్యరక్షణ మందులను 7 రోజుల వ్యవధిలో పిచికారి చేయటం ద్వారా గులాబీ రంగు పురుగును అదుపులో పెట్టుకోవటానికి అవకాశం ఉంటుంది. అలా చేయనట్లయితే ప్రత్తి దిగుబడి గణనీయంగా తగ్గటమే కాకుండా, తదుపరి పంట కాలంలో ఈ పురుగు ఎక్కువగా ఆశించటానికి అవకాశం ఉంటుంది.

**ప్రత్తి తీతలో తీసుకొనవలసిన జాగ్రత్తలు :**

ప్రత్తి తీసిన తర్వాత కూడా నాణ్యతాపరంగా బాగుండి మార్కెట్‌లో మంచి ధర పలకాలంటే..

- ప్రత్తిలో తేమ శాతం అధికంగా ఉన్నట్లయితే, బాగా ఆరబెట్టిన తర్వాత మాత్రమే మార్కెట్‌కు తరలించాలి.
- తూకం వేసే ముందు ప్రత్తి మీద నీళ్ళు చల్లరాదు. అది ప్రత్తి నాణ్యతను దెబ్బతీస్తుంది.
- వివిధ రకాల నుండి తీసిన ప్రత్తిని కలపకూడదు.
- రంగుమారిన, పక్వానికి రాని కాయలు మరియు ఎండు ఆకులు, తొక్కలు, ఇసుక, కొమ్మల ముక్కలు వంటి వ్యర్థ పదార్థాలను రైతు స్థాయిలోనే తొలగించినట్లయితే స్పిన్నింగ్ మిల్లులలో ప్రత్తి నాణ్యత తగ్గకుండా జాగ్రత్త పడవచ్చు.
- మార్కెట్‌కు రవాణా చేసేటప్పుడు, ప్రత్తిని పూర్తిగా కప్పి తీసుకొని వెళ్ళడం ద్వారా ఎండ వలన గానీ, వర్షం వలన గానీ దుమ్ము, ధూళి వల్ల కానీ ఎటువంటి నష్టం వాటిల్లదు.
- గులాబి రంగు పురుగు ఉధృతి నేపథ్యంలో గుడ్డి ప్రత్తిని పక్కకు తీసి పురుగును నాశనం చేయాలి.
- గులాబి రంగు పురుగు సోకిన ప్రత్తిని ఇళ్ళ వద్ద కానీ జిన్నింగ్ మిల్లుల వద్ద కానీ నిల్వ చేయరాదు.

**డా॥ యం. సుధారాణి,** ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
లాం ఫారం, గుంటూరు – 522 034.
చరవాణి : 99896 25207




### కంది

**సస్య రక్షణ :** కంది పంట మన రాష్ట్రంలో పూత, కాయ దశలో ఉన్నది. ఈ పంటను శనగ పచ్చ పురుగు మరియు మారుకా మచ్చల పురుగు కొన్ని ప్రాంతాలలో ఎక్కువగా ఆశించుట గమనించటమైనది. ఈ పురుగుల నివారణకు నొవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా కొరాజన్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సికార్బ్ 0.75 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పురుగు మందులు మార్చి మార్చి పిచికారి చేసి నివారించుకోవచ్చు.

గత రెండు సంవత్సరాల నుండి పిందె, కాయ దశలో కాయ ఈగ ఉధృతి కూడా ఎక్కువగా ఉండటం గమనించడమైనది. కాయ ఈగ ఆశించినపుడు నష్టం బయటకు కనిపించదు. కావున పిందె దశలో 5% వేప గింజల కషాయం పిచికారి చేసినట్లయితే తల్లి పురుగు గ్రుడ్లు పెట్టకుండా నివారించుకోవచ్చు. పిందె దశలో థయోక్లోప్రిడ్ 0.7 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

కొన్ని ప్రాంతాలలో వెర్రి తెగులు గమనించడం జరిగింది. ఇది ఇరియోఫిడ్ నల్లి ద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగులు. ఇది ఆశించిన మొక్క ఆకులమీద ఆకుపచ్చ, పసుపు వర్ణపు మచ్చలు ఏర్పడి మొక్కలకు పూత, కాయ ఏర్పడదు. నల్లి నివారణకు డైకోఫాల్ 5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**శనగ :** శనగ కొన్ని ప్రాంతాలలో శాఖీయ దశలోనూ, మరికొన్ని ప్రాంతాలలో పూత మరియు కాయ దశలో ఉంది. శాఖీయ పెరుగుదల దశలో పచ్చ రబ్బరు పురుగు, పూత, పిందె దశలలో శనగపచ్చ పురుగు ఆశించి నష్టం కలుగచేస్తుంది.

**శనగ పచ్చ పురుగు :** ఈ పురుగు పంట కాయ దశలో ఎక్కువగా ఆశిస్తుంది. కాయలపై గుండ్రటి రంధ్రాలను చేసి తల లోపలికి పెట్టి గింజలను తినివేసి అధిక నష్టం కలుగచేస్తుంది. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి. రసాయనిక మందులైన క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా స్పైనోసాడ్ 0.35 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తుప్పు తెగులు :** శనగ పైరు పక్వానికి వచ్చే దశలో ఆకులపై గుండ్రటి పొక్కులు ఏర్పడి తీవ్రమైతే మొక్కలు పక్వానికి రాకముందే ఎండిపోతాయి. నివారణకు హెక్సాకొనజోల్ 2.0 మి.లీ. లేదా ప్రొపికోనజోల్ 1.0 మి.లీ. లేదా ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ + టెబ్యుకొనజోల్ 0.8 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

**పెసర, మినుము :** రబీలో మెట్టలో వేసిన పెసర, మినుము పైర్లు పూత మరియు కాయ దశలలో ఉన్నాయి. ఆ పైర్లలో పురుగు తెగుళ్ళకు తగిన సస్యరక్షణ చర్యలు పాటించాలి.

### పురుగులు :

**తెల్లదోమ :** ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చడమేగాక పల్లాకు తెగులును కూడా వ్యాపింపచేస్తాయి. తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మిథైల్ ఓ డెమటాన్ 2.0 మి.లీ. ఏదైనా ఒక మందును ఒక లీటరు నీటిలో కలుపుకొని పిచికారి చేయవలెను.

**తామర పురుగులు :** ఈ పురుగు పైరు తొలి దశలో ఎక్కువగా ఆశించి ఆకులలో రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగ చేయటమే కాకుండా ఆకుముడత అనే వైరస్ వ్యాధిని వ్యాపింపచేస్తాయి. తామర పురుగు నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. ఏదో ఒక మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**మారుకా మచ్చల పురుగులు :** పూత, పిందె దశలో ఉన్న పంటలో 'మారుక' గూడు పురుగు ఆశించే అవకాశము ఉంది. పంటలో 35 రోజుల వయసులో వేప సంబంధిత మందులు (వేపనూనె/ వేపగింజల కషాయం) పిచికారి చేసినట్లయితే రెక్కల పురుగులు గ్రుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. పూత సమయంలో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

పైరులో గూళ్ళు ఎక్కువగా ఉన్నట్లయితే వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.0 గ్రా. లలో ఏదైనా ఒక మందుతోపాటు డైక్లోరివాస్ (నువాన్) 1.0 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించవచ్చు. పురుగు ఎక్కువగా ఉన్నట్లయితే క్లోరాంట్రనిలిప్రోల్ 20 ఎస్.సి. 0.3 మి.లీ. లేదా ఫ్లుబెండమైడ్ 0.2 గ్రా. లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. మందులలో ఏదైనా ఒక దానిని పిచికారి చేసుకోవచ్చు. అవసరమైతే పురుగుల ఉధృతిని బట్టి 7 నుంచి 10 రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి.

**తెగుళ్ళ యాజమాన్యం :** సాధారణంగా కొరినోస్పోరా ఆకుమచ్చ తెగులు, బూడిద, తుప్పు మరియు సెర్కోస్పోరా తెగుళ్ళు ఆశిస్తాయి. వీటిని సమర్థవంతంగా అరికట్టటానికి పైరు 30-35 రోజుల దశలో లీటరు నీటికి 2 మి.లీ. హెక్సాకొనజోల్ మరియు 50-55 రోజుల దశలో 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వైరస్ తెగుళ్ళ నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి. పల్లాకు తెగులు, ఆకుముడత తెగులు మరియు సీతాఫలం తెగులు ఆశించిన మొక్కలను తొలిదశలోనే గమనించి మొక్కలను పీకి వేసి, తెగులు వ్యాప్తికి కారకాలైన రసంపీల్చు పురుగులను నివారించాలి.

**ఆలస్యంగా వరి మాగాణులలో అపరాల సాగు :**

**అనువైన రకాలు :**

**పెసర :** ఎల్.జి.జి. 460, టి.యం. 96-2, ఎల్.జి.జి. 410 మరియు ఐ.పి.యం. 2-14.

**మినుము :** అన్ని కాలాలకు అనుకూలమైన రకాలైనటువంటి జి.బి.జి. 1, టి.బి.జి. 104, ఎల్.బి.జి. 752, ఎల్.బి.జి. 787 మరియు పి.యు. 31 మాత్రమే విత్తుకోవాలి.

**విత్తన మోతాదు :** ఒక చదరపు మీటరుకు సుమారు 30-35 మొక్కలు ఉండేటట్లుగా మినుము అయినట్లయితే ఎకరాకు 16-18 కిలోలు, పెసర అయినట్లయితే ఎకరాకు 12 కిలోలు వెదజల్లితే మంచి దిగుబడులు సాధించవచ్చు.

**డా॥ యం. వి. రమణ,** ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం. లాం, గుంటూరు.
చరవాణి నెం : 99896 25215

# చెఱకు



- స్వల్పకాలిక మరియు మధ్యకాలిక చెఱకు రకాల మొక్కతోట మరియు కార్శి తోటలను పక్వత నిర్ధారణానుసారం సకాలంలో నరికి బెల్లం తయారీకి లేదా పంచదార కర్మాగారాలకు సరఫరా చేయాలి.
- జనవరిలో చెఱకు నరికిన తరువాత కార్శితోట సాగుకు, చెఱకు మోళ్ళు భూమట్టానికి చెక్కి, నాగలి నడిపి, మోళ్ళ భుజాలు నరకడం ద్వారా కార్శి పిలకలు ధృడంగా వస్తాయి. నాగలి నడిపిన చాళ్ళలో కార్శికి సిఫారసు చేసిన భాస్వరం, పొటాష్ మరియు మొదటి దఫా నత్రజని ఎరువులను వేసుకోవాలి. తరువాత ఎకరానికి 1.3 టన్నుల చెఱకు చెత్తను చాళ్ళలో కప్పాలి. మొక్కతోట నరికిన తరువాత కార్శి చేయడానికి చెఱకు చెత్తను కాల్చకుండా ట్రాష్ ష్రెడ్డర్ నడిపినట్లయితే చెత్త త్వరగా చివికి సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడుతుంది.
- చెఱకు కార్శి తోటలో చాళ్ళలో 50 సెం.మీ. మేర దుబ్బులు లేనప్పుడు ఖాళీగా గుర్తించి తప్పక ఖాళీలను అదే రకానికి చెందిన చెఱకు పిలకలు లేదా చెఱకు నారు మొక్కలతో భర్తీ చేసుకోవాలి.
- 87ఎ298 (విశ్వామిత్ర) రకానికి కొరడా తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. మొక్కతోటల్లో ముచ్చెలు నాటే ముందు ప్రోపికొనజోల్ మందుతో లీటరు నీటికి 1.0 మి.లీ. చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసి నాటు కోవాలి. మొక్క తోటల్లో కంటే కార్శి తోటల్లో కొరడా తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. కనుక ప్రొపికొనజోల్ మందును 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి కార్శి చేసిన వెంటనే ఒకసారి, కార్శి చేసిన 30-40 రోజులకు మరొక సారి పిచికారి చేయాలి.
- నీటి ఎద్దడి మరియు నీటి ముంపు నెలకొనే ప్రాంతాల్లో చెఱకు నాట్లు చేపట్టేటప్పుడు ఆ పరిస్థితులకు అనువైన

రకాలను ఎంపిక చేసుకొని భూమి తయారీలో 2.5 నుండి 3 అడుగుల దూరంలో చాళ్ళు వేసి జనవరి ఆఖరులోగా నాట్లు పూర్తి చేయాలి. ముచ్చెలు నాటే ముందు 10 శాతం సున్నపు ద్రావణంలో ఒక గంటసేపు నాన బెట్టి నాటుకోవాలి. దీని వలన మొలక శాతం పెంపొందుతుంది. పంట నీటి ఎద్దడిని కూడ తట్టుకుంటుంది.

- మొక్కతోట నాటిన 3 రోజుల లోపున కలుపు మందు ఎకరాకు "అట్రాజిన్" 2 కిలోలు లేదా "మెట్రిబ్యుజిన్" 600 గ్రా. 200 లీటర్ల నీటికి కలిపి భూమిపై పిచికారి చేయాలి.
- ముచ్చెలు మొలిచిన తరువాత పంట ఎదిగే దశలో కలుపును నివారించడానికి ఎకరాకు "మెట్రిబ్యుజిన్" 400 గ్రా. + 2,4 డి సోడియం సాల్ట్ 800 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి చెఱకు నాటిన 20-25 రోజులకు పిచికారి చేయాలి. దీని వలన పంటకు హాని లేకుండా అన్ని రకాల కలుపు మొక్కలు నివారింపబడతాయి. మెట్రిబ్యుజిన్ మందు ముచ్చెలు నాటిన 45 రోజుల లోపల మాత్రమే పిచికారి చేయాలి.
- ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యం పొందుతున్న నారు మొక్కలతో చెఱకు సాగుకు జనవరి మాసం చాలా అనుకూలం. 30 రోజుల వయసున్న నారు మొక్కలను నాటుకోవాలి. నాటే ముందు ఎకరానికి 10.0 టన్నుల పశువుల గెత్తం తప్పని సరిగి వేయాలి. జంట చాళ్ళ పద్ధతి (60×120 సెం.మీ.) లేదా 90 సెం.మీ. దూరంలో చాళ్ళు రూపొందించి మొక్కకు మొక్కకు మధ్య 45 సెం.మీ. దూరంలో నారు మొక్కలు నాటాలి. ఎకరానికి 8,000 - 10,000 నారు మొక్కలు అవసరం అవుతాయి. నాటిన తరువాత ప్రతి 4-5 రోజులకు పలచని తడి ఇవ్వాలి. మొత్తం భాస్వరం ఎరువును నాటేటప్పుడు వేయాలి. నత్రజని, పొటాష్ ఎరువులను నాలుగ దఫాలుగా నాటినప్పుడు, నాటిన 30, 60, 90 రోజులకు మొక్కల మొదళ్ళ దగ్గర వేసి కప్పాలి. ఎరువు వేసిన ప్రతిసారి పలుచగా నీరు పెట్టాలి.

**డా॥ టి. చిత్కళా దేవి,** ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు),
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, అనకాపల్లి.
చరవాణి : 99896 25216




- 45-50 రోజుల దశలో ఉన్న రబీ మొక్కజొన్న పైరుకు ఒక దఫా నత్రజని ఎరువు ఎకరాకు 50 కి. యూరియా వేయాలి మరియు 60-65 రోజుల దశలో నాల్గవ దఫాగా నత్రజని (80-90 కి. యూరియా ఎకరానికి) వేయాలి. రెండవ దఫా మ్యూరేట్ అఫ్ పొటాష్ ఎరువును ఎకరాకు 25 కిలోలు నాల్గవ దఫా నత్రజనితో పాటుగా వేయాలి.
- పూత దశకు ముందు, పూత దశ మరియు గింజ పాలు పోసుకునే దశలలో పైరుకు నీటి ఎద్దడి రాకుండా చూడాలి. నేల స్వభావాన్ని బట్టి 10 నుండి 15 రోజుల వ్యవధిలో నీటి తడులు ఇవ్వాలి.
- బెట్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు 2% యూరియా ద్రావణాన్ని వారం రోజుల వ్యవధితో 2 నుంచి 3 సార్లు పిచికారి చేసినట్లైతే బెట్ట పరిస్థితుల నుండి పంటను కొంత వరకు రక్షించవచ్చు.
- కాండం కుళ్ళు తెగులు నేలలో తేమ శాతం తగ్గినప్పుడు మరియు వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగినప్పుడు పూత దశ నుండి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాండంపై గోధుమ రంగు చారలు ఏర్పడి, బెరడు భాగం క్రమేణా కుళ్లిపోయి కాండం విరిగిపోతుంది. కాబట్టి పూత దశ నుండి నీటి ఎద్దడి లేకుండా చూడాలి. ఆకు మాడు/ఆకు ఎండు తెగుళ్ల నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి పిచికారి చేయాలి. పొడ తెగులు లక్షణాలు గమనించిన వెంటనే ప్రోపికొనజోల్ 1 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చు.
- పంట అన్ని దశలలో కత్తెర పురుగు ఉధృతి ఉంటుంది. పురుగు యొక్క ఉనికిని రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండడంతో పాటు, సరైన యాజమాన్య పద్ధతులు సకాలంలో పాటించాలి. కత్తెర పురుగు యొక్క ఉనికిని మరియు ఉధృతిని తగ్గించేందుకు ఎకరానికి నాలుగు

చొప్పున లింగాకర్షక బుట్టలు వాడాలి. పురుగు యొక్క రెండు మరియు మూడవ దశ లార్వాలు కాండం మొవ్వులో చేరి తినడం వలన మొవ్వు కత్తిరించినట్లుగా కనిపిస్తుంది. మొవ్వులోపల ఉన్న పూత నష్టపోయి కంకి పూర్తిగా తయారవదు.

- రెండవ దశ దాటిన లార్వల నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్.డి. 0.4 గ్రా. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5% ఎస్.సి. 0.3 మి.లీ. లేదా స్పైనిటోరం 11.7% ఎస్.సి. 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి సుడులు/ మొవ్వు లోపలి ఆకులు పూర్తిగా తడిచేటట్లు పిచికారి చేయాలి. అవసరాన్ని బట్టి 2 నుండి 3 సార్లు మందును పిచికారి చేయాలి.
- పురుగు తీవ్రత ఎక్కువైనప్పుడు విషపు ఎరను సాయంత్రం వేళలో ప్రయోగించాలి. 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం మరియు 2 లీ. నీరు కలిపి 24 గంటల పాటు ఉంచిన తర్వాత 100 గ్రా. థయోడికార్బ్ ను కలిపి సాయంత్రం వేళలలో సుడులు / పత్రగుచ్ఛం / మువ్వులో వేయాలి.
- తొలకరి వరి కోసిన తరువాత పొలంలో దుక్కి దున్నకుండానే పదును చూసుకుని మొక్కజొన్న విత్తనాలను నేరుగా విత్తుకునే విధానమే జీరో టిల్లేజ్ మొక్కజొన్న సాగు. కోస్తా జిల్లాల్లో జనవరి 31 వరకు ఈ పద్ధతిలో విత్తుకోవచ్చు. మొక్కజొన్న విత్తనం మొలకెత్తడానికి అనువైన తేమ నేలలో ఉండేటట్లు వరికి ఆఖరి తడి ఇవ్వాలి. వరి మాగాణుల్లో నేలను దున్నడం ఉండదు కాబట్టి కులుపు ఎక్కువగా వస్తుంది. కలుపు నివారణకు మరియు వరి దుబ్బులు చిగురు వేయకుండా ఎకరాకు 0.5 కి. అట్రాజిన్ 50% మరియు 0.5 లీటర్ల పారాక్వాట్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే పిచికారి చేయాలి. ఇతర యాజమాన్య పద్ధతులు రబీ మొక్కజొన్న పంటకు ఆచరించినట్లుగానే వరి మాగాణుల్లో సాగు చేయబడే పంటకు కూడా పాటించాలి.

**డా॥ ఐ. సుధీర్ కుమార్,**
శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం)
వ్యవసాయ పరిశోధనా స్థానం, పెద్దాపురం.
చరవాణి : 99597 92568




### జొన్న

**మాఘీ జొన్న :** కోతకు సిద్ధంగా ఉన్న పంటలను కోయాలి. కంకి క్రింద వరుసలో ఉన్న గింజలు ఆకుపచ్చ రంగు నుండి తెల్లగా మారి గింజలోనున్న పాలు ఎండిపోయి పిండిగా మారినప్పుడు గింజల క్రింద భాగంలో నల్లటి చార ఏర్పడినప్పుడు పంటను కోయాలి. కంకులను పల్చగా ఆరబెట్టి నూర్పిడి చేసి బాగా ఆరిన గింజలను నిల్వ చేయాలి.

**రబీ జొన్న :** ఆకుమాడు, ఎర్రమచ్చ, తుప్పు తెగుళ్ళు ఎక్కువగా ఉన్నప్పుడు మొక్కలు సరిగా ఎదగవు. కావున ఈ తెగుళ్ళు నివారించడానికి మాంకోజెబ్ మందును 2.5 మి.లీ. / లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పొలంలో కలుపు మొక్కల ప్రభావం ఎక్కువగా ఉంటే గుంటక లేదా దంతితో అంతరకృషి చేసుకోవాలి.

### సజ్జ :

అధిక దిగుబడినిచ్చు సజ్జ హైబ్రిడ్ రకాలు : హెచ్.హెచ్.బి. 67, ఐ.సి.యమ్.హెచ్. 356 మరియు ఆర్.హెచ్.బి. 121.

**అధిక దిగుబడినిచ్చు కాంపోజిట్ సజ్జ రకాలు :** ఐ.సి.యమ్.వి. 221, ఐ.సి.టి.పి. 8203, రాజ్ 171 మరియు ఎ.బి.వి. 04.

- వేసవి సజ్జను జనవరి మాసంలో విత్తుకోవాలి.
- ఎకరాకు 1.6-2 కిలోల విత్తనం సరిపోతుంది.
- కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్‌తో కలిపి విత్తుకోవాలి. వెర్రికంకి తెగులు సోకకుండా అప్రాన్ 35 యస్.డి. తో 1 కిలో విత్తనానికి 6 గ్రా. చొప్పున కలుపుకొని విత్తుకోవాలి.
- ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువును వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 16 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరము మరియు 12 కిలోల పొటాష్‌ను ఇచ్చు ఎరువులను ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి.

- విత్తిన 48 గంటల లోపు అట్రాజిన్ 50% పొడి మందును ఎకరాకు 800 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి తడి నేలపై పిచికారి చేస్తే కలుపు మొక్కలను నివారించవచ్చును. విత్తిన 15-20 రోజుల తర్వాత దంతితో ఎడసేద్యం చేయాలి.

**రాగి :**

- వేసవిలో జనవరి మాసంలో విత్తుకోవాలి.
- అధిక దిగుబడినిచ్చు రాగి రకాలు : గోదావరి, వకుళ, శ్రీచైతన్య, తిరుమల, హిమ (తెల్ల రాగి), సువర్ణముఖి, వేగావతి, గౌతమి మరియు ఇంద్రావతి రకాలను ఎంపిక చేసుకొని సాగు చేయాలి.
- ఎకరాకు నారు నాటే పద్ధతికి 2.5 కిలోలు లేదా వెదజల్లే పద్ధతికి 4 కిలోల విత్తనం సరిపోతుంది. కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండెజిమ్ లేదా 3 గ్రా. మాంకోజెబ్ లేదా 2 గ్రా. ట్రైసైక్లోజోల్ డబ్ల్యు.పి. మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి. నాటేటప్పుడు వరుసల మధ్య 20-25 సెం.మీ. మొక్కల మధ్య 10-15 సెం.మీ. దూరం ఉండేలా నాటుకోవాలి.
- ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువును వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. నాట్లు వేసే ముందు 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం మరియు 12 కిలోల పొటాష్‌నిచ్చు ఎరువులను వేయాలి.
- **అగ్గి తెగులు :** నారు మడిలో తెగులు సోకినప్పుడు లేత మొక్కలు మాడిపోతాయి. ఎదిగిన మొక్కల ఆకులపై దారపు కండె ఆకారంలో మచ్చలు చుట్టూ ఎరుపు గోధుమ రంగు అంచులు ఉండి మధ్యలో బూడిద రంగు కలిగి ఉండును. కణుపుల మీద కూడా ఈ వ్యాధి నలుపు రంగు మచ్చల రూపంలో కనిపిస్తుంది. మెడ విరుపుగా ఆశించినప్పుడు కణుపు దగ్గర మొక్క విరిగిపోతుంది. వెన్నుపై ఆశించినప్పుడు ధాన్యపు గింజలు తాలు గింజలుగా మారుతాయి. అధిక నత్రజని వాడినప్పుడు తెగులు ఎక్కువగా కనిపిస్తుంది. దీని నివారణకు తెగులును తట్టుకొను రకాలను సాగు చేయాలి. 3 గ్రా. థైరామ్ లేదా కాప్టాన్‌ను లేదా 2 గ్రా. ట్రైసైక్లోజోల్ డబ్ల్యు.పి. మందును కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలి. మొక్కలపై మచ్చలు కనిపించిన వెంటనే కార్బండెజిమ్ మందును లీటరు నీటికి 1 గ్రా. లేదా ట్రైసైక్లోజోల్ డబ్ల్యు.పి. మందును లీటరు నీటికి 0.5 గ్రా. చొప్పున కలిపి పైరుపై పిచికారి చేయాలి.

**కొర్ర :**

- కొర్ర పంటను వేసవిలో జనవరి మాసంలో విత్తుకోవచ్చు.
- అధిక దిగుబడినిచ్చు కొర్ర రకాలు : ప్రసాద్, శ్రీకృష్ణదేవరాయ, నరసింహరాయ, శ్రీలక్ష్మీ, సూర్యనంది, యస్.ఐ.ఎ. 3085, యస్.ఐ.ఎ. 3156, గరుడ మరియు రేనాడు మొదలైన రకాలను సాగు చేసుకోవాలి.
- ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తన శుద్ధి కొరకు కిలో విత్తనానికి 2గ్రా. కార్బండెజిమ్ లేదా 2 గ్రా. ట్రైసైక్లోజోల్ డబ్ల్యు.పి. మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.
- చాళ్ళ మధ్య 20-25 సెం.మీ. మొక్కల మధ్య 7.5-10 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి.
- ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువును వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 8 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం విత్తేటప్పుడు వేయాలి.

**డా॥ యం. హేమంత్ కుమార్,**
ప్రధాన శాస్త్రవేత్త (చిరుధాన్యాలు)
వ్యవసాయ పరిశోధనా స్థానము, పెరుమాళ్ళపల్లె.
చరవాణి : 99896 25227




- ప్రస్తుతం రబీ వేరుశనగ పంట 15-45 రోజుల దశలో ఉన్నది.
- పూత దశలో (30-40 రోజులలో) ఎకరాకు 8 కిలోల యూరియాను పై పాటుగా వేసుకోవాలి. అదే విధముగా ఎకరాకు 200 కిలోల జిప్సం పొడిని భూమిలో వేసి బాగా కలియబెట్టి మట్టిని మొక్క మొదలుకి ఎగతోయాలి. కదిరి లేపాక్షి రకానికి చెట్లను తడికలు వేసి తొక్కాలి. ఈవిధంగా చేయటం వలన కొమ్మలు నేలపై పరచుకొంటాయి.

- పూత దశ నుండి కాయలు ముదిరే వరకు పంట బెట్టకు గురి కాకుండా నీటి తడులు ఇవ్వాలి.
- ఈ దశలో పంట పై రసం పీల్చు పురుగులు (పచ్చ దోమ, తామర పురుగులు) ఆశిస్తాయి. అదేవిధంగా ఆకు తినే పొగాకు లద్దె పురుగు మరియు పచ్చ పురుగు కూడా ఆశిస్తాయి. పై దశలో మొవ్వకుళ్ళు వైరస్ తెగులు ఆశిస్తాయి.
- సూక్ష్మధాతువులైన, ఫార్ములా 4 లేదా గ్రోత్ లేదా మాక్స్‌ని ఎకరాకు 500 గ్రా. పొడరుని 200 లీ. నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి (కదిరి లేపాక్షి రకానికి ఒక కిలో ఉపయోగించాలి).
- 20 నుండి 40 రోజుల దశలో ఉన్న వేరుశనగ పంటపై రసం పీల్చు పురుగుల ఉధృతి గమనించి అంతర్వాహిక పురుగు మందులైన ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. + 5 మి.లీ. వేప నూనెను ఒక లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలు బాగా తడిచే విధంగా పిచికారి చేయాలి.
- లద్దె పురుగు మరియు పచ్చ పురుగు తల్లి మరియు తొలి దశ పురుగు నివారణకి వేప గింజల కషాయం 5 శాతం లేదా వేప సంబంధిత మందులను 5.0 మి.లీ. 1 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తొలి దశ పురుగు నివారణకి క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. ఎదిగిన గొంగళి పురుగు నివారణకి థయోడికార్బ్ 1.0 గ్రా. లేదా నొవల్యురాన్ 1.0 మి.లీ. లేదా క్లోరోఫెన్ పైర్ 2.0 మి.లీ. 1 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- మొవ్వ కుళ్ళు వైరస్ తెగులు నివారణకు అన్ని రకాలైన కలుపు మొక్కలను పూత దశకు రాక మునుపే తీసివేయాలి. ఈ వైరస్ తెగులుకు కారకమైన తామర పురుగుల (రసం పీల్చే పురుగు) నివారణకు మోనోక్రోటోఫాస్ 320 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్.ఎల్. 60 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారి చేయాలి.
- ఆకు మచ్చ తెగుళ్ళు అయిన లేత ఆకుమచ్చ, ముదురు ఆకుమచ్చ మరియు తుప్పు లేదా కుంకుమ తెగులు పంటపై కనిపించిన వెంటనే మాంకోజెబ్ 2.0 గ్రా. మరియు 1.0 గ్రా. కార్బండెజిమ్ లేదా హెక్సాకొనజోల్ 2.0 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ 1.0 మి.లీ. 1 లీటరు నీటికి కలిపి మొక్కలు బాగా తడిచే విధంగా పిచికారి చేయాలి.

**డా॥ కె.యస్.యస్. నాయక్**
ప్రధాన శాస్త్రవేత్త (వేరుశనగ),
వ్యవసాయ పరిశోధనా స్థానం, కదిరి.
చరవాణి : 99896 25217



# ప్రొద్దు తిరుగుడు

- రబీలో వర్షాధారంగా విత్తిన పంట ప్రస్తుతం కోత దశలో ఉంటుంది. పువ్వు వెనక భాగం నిమ్మ పచ్చ రంగుకు మారిన తరువాత పువ్వులను కోసి వాటిని 2-3 రోజులపాటు ఎండలో ఆరనివ్వాలి. విద్యుత్ ద్వారా నడిచే నూర్పిడి యంత్రాలను ఉపయోగించి విత్తనాన్ని వేరు చేసుకొని గింజలలో తేమ 9-10% వచ్చే వరకు ఎండబెట్టాలి.
- నీటి వసతి క్రింద నవంబరు మాసంలో విత్తిన పంట ప్రస్తుతం 30-45 రోజుల దశలో ఉంటుంది. ఈ సమయములో ఎకరానికి 8 కిలోల నత్రజని (17 కిలోల యూరియా) ని పైపాటుగా వేసుకోవాలి.
- ఈ పంటలో మొగ్గ తొడిగే దశ, పువ్వు వికసించే దశ మరియు గింజకట్టు దశలను కీలకంగా పరిగణించాలి. ఈ దశలో తప్పక నీటి తడులివ్వాలి. పువ్వు వికసించే దశలో నీటి ఎద్దడికి గురి అయినట్లయితే దిగుబడి తగ్గే అవకాశముంది.
- ఆకులన్నీ తినే పురుగులు (పొగాకు లద్దె పురుగు, బీహారి గొంగళి పురుగు) ఆశించినట్లయితే 5% వేప గింజల కాషాయము లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా నొవల్యురాన్

1 మి.లీ. లేదా ఫ్లుబెండమైడ్ 0.2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

- శనగపచ్చ పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లయితే స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా నొవల్యురాన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పంటపై బూడిద తెగులు గమనించినట్లయితే నివారణకు డైఫెనకొనజోల్ 0.5 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. ను 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.
- పంటపై తెల్ల దోమ ఉధృతి ఎక్కువైతే థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా డైఫెన్థియురాన్ 1.25 గ్రా. లేదా ఫ్లోనికమైడ్ 0.3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**డా॥ యస్. నీలిమ,** శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం)
చరవాణి : 73820 13738
**డా॥ కె. వెంకటరమణమ్మ,** శాస్త్రవేత్త (మొక్కల తెగుళ్ళ శాస్త్రం)
చరవాణి : 99088 29618
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల.




- జూన్ మాసంలో వేసిన ఆముదం పంట ప్రస్తుతం 180–185 రోజుల దశలో ఉంది. ఆఖరి కంకిని కోయని రైతులు వెంటనే కోసి ఎండలో ఆరబెట్టి నూర్పిడి చేసుకోవాలి.
- జూలై మాసంలో వేసిన పంట ప్రస్తుతము 150–155 రోజుల దశలో (మూడవ కంకి కోత దశలో) ఉంది. ఈ దశలో గెలలో 80 శాతం వరకు కాయలు ముదురు ఆకుపచ్చ నుండి లేత పసుపు రంగుకు మారినప్పుడు గెలలను కోసి ఎండలో ఆరబెట్టి, టార్పాలిన్ కప్పి కాయలు విడిపోయిన తర్వాత ఆముదపు నూర్పిడి యంత్రం ద్వారా కాయల నుండి విత్తనాలను వేరు చేసుకోవాలి.
- జూలై చివరి వారం లేదా ఆగస్టు మొదటి వారంలో వేసిన ఆముదపు పంట ప్రస్తుతం రెండవ కంకి ఏర్పడే దశలో ఉంది. ఈ దశలో 6 కిలోల నత్రజని (13 కిలోల యూరియా) ఎకరానికి పై పాటుగా తేమ ఉన్నట్లు అయితే వేసుకోవాలి.
- ఆముదం పంటను చాలా మంది రైతులు కోసిన తర్వాత నూర్పిడి చేయకుండా కాయలు గానే అమ్ముతున్నారు. అలాకాకుండా ఆముదం నూర్పిడి యంత్రం ద్వారా నూర్పిడి చేసి అమ్మినట్లయితే అధిక నికర ఆదాయం పొందవచ్చు. ఆముదము నూర్పిడి యంత్రము నడపడానికి రోజుకు 6 మంది కూలీలతో పాటు గంటకు రెండు లీటర్ల డీజిలు అవసరం అవుతుంది. ఈ యంత్రంతో గంటకు 800 నుండి 1000 కిలోల కాయలను నూర్పిడి చేసి గింజలు తీయవచ్చు.
- దాసరి లేదా నామాల పురుగు మరియు పొగాకు లద్దె పురుగులు ఆముదపు పంటను ఆశించి ఎక్కువ నష్టాన్ని కలుగచేసే అవకాశం ఉంటుంది. ఒకవేళ పైన చెప్పిన పురుగులు ఆశించినట్లయితే నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- కంకి పూత / కాయ ఏర్పడే సమయంలో వర్షం వచ్చే సూచనలు ఉన్నప్పుడు, ఆకాశం మేఘావృతమై ఉన్నప్పుడు లేదా తుఫాన్ వల్ల ఎడతెరపి లేకుండా 5–6 రోజులుగా వర్షాలు పడుతున్నప్పుడు బూజు తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ తెగులు ఆశించినప్పుడు గెలల పైన లేదా కొన్ని కాయలపైన దూది పింజ లాంటి బూడిద లేదా గోధుమ వర్ణపు శిలీంద్రము పెరిగి తర్వాత కంకిలోని అన్ని కాయలకు వ్యాపిస్తుంది. తెగులు సోకిన కాయలు మెత్తబడి, కుళ్ళి రాలిపోతాయి. కావున ఆకాశం మేఘావృతమై ఉన్నప్పుడు లేదా తుఫాన్ సూచనలు తెలిసిన వెంటనే వర్షానికి కనీసం 6–8 గంటల ముందు ఒకసారి మరియు వర్షాలు తగ్గిన తర్వాత 6–8 గంటల లోపు ఇంకోసారి లీటరు నీటికి 1 గ్రా. కార్బండెజిమ్ లేదా 1 గ్రా. థయోఫెనేట్ మిథైల్

లేదా ప్రొపికొనజోల్ 2 మి.లీ. కలిపి అన్ని భాగాలు తడిచేలా పిచికారి చేయాలి.

- పచ్చ దీపపు పురుగులు లేదా పచ్చ దోమ ఆశించినప్పుడు క్లోథయోనిడిన్ 0.1 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ఆముదంలో తామర పురుగులు ఆశించినప్పుడు, నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- తెల్ల దోమ ఆశించినప్పుడు ట్రైజోఫాస్ 45 ఇ.సి. 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- రబీలో వేసిన ఆముదం పంట ప్రస్తుతం మొదటి కంకి ఏర్పడే దశలో ఉంది. కావున పైపాటుగా 6 కిలోల నత్రజని (13 కిలోల యూరియా) ఎకరానికి వేసుకోవాలి. గెలలో 80 శాతం వరకు కాయలు ముదురు ఆకుపచ్చ నుండి లేత పసుపు రంగుకు మారినప్పుడు గెలలను కోసి ఎండలో ఆరబెట్టి, టార్పాలిన్ కప్పి కాయలు విడిపోయిన తర్వాత ఆముదపు నూర్పిడి యంత్రం ద్వారా కాయల నుండి విత్తనాలను వేరు చేసుకోవాలి.
- హైబ్రిడ్ విత్తనాలు ఉత్పత్తి చేసే పొలాలలో మొదటి కంకి పూత దశలో మగ వరుసలలో కణుపుల సంఖ్య మరియు ఎక్కువగా మగ పూత వచ్చిన మొక్కల ఆధారముగానాలుగైదు సార్లు కేళీలను గుర్తించి తీసి వేయాలి, ఆడ మొక్కలలో గెల మొత్తం ఆడ పుష్పాలు ఉన్న మొక్కలను మాత్రమే ఉంచాలి. గెల క్రింద భాగాన మగ పుష్పాలు వస్తే అట్టి మొక్కను పీకి వేయాలి. ఆడ మొక్కల గెలల్లో ఆడ పుష్పాల మధ్య తరచుగా మగ మొగ్గలు వస్తూ ఉంటాయి. ఇట్టి మొగ్గలను ఎప్పటి కప్పుడు విచ్చుకోక ముందే తీసి వేయవలెను.

**డా॥ ఎ.వి.ఎస్. దుర్గాప్రసాద్,**
శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం)
చరవాణి : 95817 00298
**డా॥ వై. పవన్ కుమార్ రెడ్డి**, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం)
వ్యవసాయ పరిశోధనా స్థానం. అనంతపురము.
చరవాణి : 99669 70300




నువ్వు సాగులో ఉష్ణోగ్రత చాలా ముఖ్య పాత్ర వహిస్తోంది. కాబట్టి చలి తగ్గిన తరువాత విత్తనాలు వేసుకోవాలి.

**విత్తు వేయటం :** డిసెంబరు 15 నుంచి జనవరి 25 వరకు కాని మంచు ఎక్కువగా కురిసే ప్రదేశాలలో, మంచు తగ్గిన తరువాత (రాత్రి ఉష్ణోగ్రత $18^0$ సెంటీగ్రేడ్ కన్నా ఎక్కువ ఉండాలి) అంటే జనవరి మాసంలో చేపట్టాలి. మంచు కురిస్తే చలి ఎక్కువగా ఉంటే నువ్వు మొక్కలు చనిపోయే అవకాశం ఎక్కువ. కాబట్టి ఇది గమనించి వేసుకోవాలి.

**నేలలు :** నీరు నిలబడే నేలలు, చౌడు నేలలు, ఆమ్ల క్షార నేలలు పనికిరావు. నీరు నిలువ ఉండని తేలిక మరియు బరువు నేలలు అనుకూలం.

**విత్తన మోతాదు :** ఎకరానికి 2.5 కిలోలు నువ్వు విత్తనంను 2.5 కిలోల గంప్ర ఇసుక లేదా నూకలలో కలిపి చల్లాలి (ఇసుక, విత్తనం సమపాళ్ళలో వేయాలి). ముందుగా విత్తనాన్ని విత్తన శుద్ధి చేసి ఇసుకలో కలిపి చల్లాలి.

**విత్తన శుద్ధి :** కిలో విత్తనానికి 1.5 గ్రా. మాంకోజెబ్ మందు కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.

**నేల తయారీ :** నేలను మెత్తగా దున్నుకోవాలి. దుక్కు ఎంత మెత్తగా ఉంటే మొక్క అంత బాగా వస్తుంది.

**ఎరువులు :** ఆఖరి దుక్కిలో ఎకరానికి పశువుల ఎరువు 4 టన్నులు, నత్రజని 8 కిలోలు + భాస్వరం 8 కిలోలు + పొటాష్ 8 కిలోలు వేసుకొని కలియ దున్నాలి.

**నీటి యాజమాన్యం :** నీరు పెట్టి అదును కుదురగానే దున్ని విత్తనాన్ని చల్లుకోవాలి.

**రకాలు :** ఎలమంచిలి 11 (వరహా), ఎలమంచలి 17 (గౌతమ్), ఎలమంచలి 66 (శారద) రకాలు (ముదురు గోధుమ రంగు గింజ రకాలు) అనుకూలం.

**డా॥ తులసీ లక్ష్మీ**
శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) మరియు అధిపతి,
వ్యవసాయ పరిశోధనా స్థానం,
యలమంచిలి, విశాఖపట్నం జిల్లా. ఫోన్ నెం. 89853 70076




- వర్షాధారంగా సాగు చేసిన కంది, శనగ పంటను కంబైన్డ్ హార్వేస్టర్ ద్వార పంటను కోసి నూర్పిడి యంత్రాల ద్వార గింజలను వేరు చేసుకొనవలెను.
- వర్షాధార పంటల కోత అనంతరము గొర్రెలు, మేకలు ఉన్న చోట పొలంలో మంద కట్టి, భూసారాన్ని పెంచుకోన వలెను.
- వర్షాధార పంట కోతల అనంతరము పంట అవశేషాలను నేల మీద మల్చింగ్ లాగా ఉంచవలెను లేదా పంట అవశేషా లను వర్షాధారంగా సాగు చేసిన ఉద్యానవన పంటలలో మల్చింగ్ లాగా వేయాలి.
- పంట అవశేషాలను కాల్చకూడదు, పంట అవశేషాలను వేస్ట్ డీ కంపోసర్ పిచికారి చేసి కుళ్ళబెట్టి, నేలలో కలియ దున్నవలెను.

**డా॥ బి. సహదేవ రెడ్డి**
ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి, మెట్ట వ్యవసాయం
వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురము.
చరవాణి : 99896 25222




జనవరి మాసం మొదలు వేసవి కాలం అనగా మే, జూన్ మాసాల వరకు పచ్చిమేత లభ్యత క్రమేణా తగ్గి, పశు పోషణ కష్టతరమగును. దీనిని దృష్టిలో ఉంచుకొని పశుగ్రాసాలను వివిధ రూపాలలో భద్రపరచుకొని, పోషక విలువలు తగ్గకుండా పశుపోషణ సాగించడం వలన రైతులు మంచి ఆదాయం పొందడానికి అవకాశం ఉండును. వేసవిలో పశుగ్రాస లభ్యత కొరతను అధిగమించడానికి, జనవరి మాసంలో రైతులు మొక్కజొన్న, జొన్న పంటలను సామూహికంగా సాగు చేయడం వలన, పంటను సులభంగా అమ్మడానికి, మంచి ఆదాయం పొందడానికి అవకాశం ఉండును. ముఖ్యంగా ప్రభుత్వం వారు నిర్వహించు ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు మొదలగు పథకాలకు, పాడి పథకాలకు కావలసిన మేతను అందించడానికి, పశు గ్రాసాలను పాతర గడ్డి రూపంలో నిల్వ చేసుకొని, పశువుల మేతగా వేసవికాలంలో ఉపయోగించుకొని అధిక లాభాలు అర్జించవచ్చును. అన్ని రకాల పశుగ్రాసాలలో మొక్కజొన్నను పచ్చిమేతగా, పాతర గడ్డిగా వినియోగించడానికి అత్యంత అనుకూలమైన పంట. అందువలన రైతులు నీటి వసతి క్రింది బోర్లు, బావులు ఉన్న రైతులు పశుగ్రాస మొక్కజొన్నను జనవరి మాసంలో విత్తుకోవడం వలన మంచి దిగుబడి పొందవచ్చును. ప్రధానంగా రైతులు మొత్తం పంటను ఒకేసారి విత్తుకోకుండా, 15 నుండి 20 రోజుల వ్యవధిలో దఫాలుగా విత్తుకోవడం వలన వేసవిలో పశుగ్రాస కొరతను అధిగమించడానికి అవకాశం ఉండును.

**డా॥ యస్. తిరుమల రెడ్డి,** శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతి.
చరవాణి : 94920 73308

**గమనిక : రైతు సేవలో టోల్ ఫ్రీ నెంబర్లు**

| | | |
|---|---|---|
| ఫార్మర్స్ కాల్ సెంటర్ (ఆంగ్రూ) | : | 1800 425 0430 |
| ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ (డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రం) | : | 155251 |
| కిసాన్ కాల్ సెంటర్ | : | 1800 180 1551 |
| ఉద్యాన శాఖ | : | 1800 425 2960 |
| శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం | : | 1800 120 4209 |
| అన్నపూర్ణ కృషి ప్రసార సేవ | : | 1800 425 3141 |
| మత్స్య శాఖ | : | 1800 425 1188 |
| వాతావరణ సూచనలు (భారత ప్రభుత్వం) | : | 1800 180 1717 |

# రబీ వరిలో కలుపు యాజమాన్యం

డా॥ యు. వినీత, సీనియర్ శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); డా॥ సి.హెచ్. శ్రీలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల ప్రజననశాస్త్రం); డా॥ ఐ. పరమశివ, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం) మరియు డా॥ పి. రాజశేఖర్, ప్రధాన శాస్త్రవేత్త & అధిపతి, వ్యవసాయ పరిశోధనా స్థానం, నెల్లూరు.

ఆంధ్రప్రదేశ్‌లో వరి ప్రధాన ఆహార పంట. ఆంధ్ర రాష్ట్రంలో సుమారుగా 25 లక్షల హెక్టార్లలో సాలీనా వరిని సాగు చేస్తున్నారు. కూలీల కొరత మరియు ఖర్చు అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితులలో కలుపు యాజమాన్యము వరిలో ఒక ప్రధాన సమస్యగా చెప్పుకోవచ్చు. ఒకవేళ సకాలంలో కలుపును నియంత్రించలేకపోతే సుమారుగా 30% వరకూ దిగుబడులు తగ్గుతాయని శాస్త్రీయంగా నిరూపించబడినది. వరిలో కలుపు అధికంగా రావడానికి గల కారణాలు విశ్లేషించినట్లయితే వేసవి దుక్కులు సరిగా చేయకపోవడం, దమ్ము సరిగా చేయకపోవడం, రెండు పంటలు వేసుకునేటప్పుడు సరిగా గడ్డి కుళ్ళకపోవడం, నీటి యాజమాన్యంలో లోటుపాట్లు, అధికంగా నత్రజని సంబంధిత ఎరువుల వాడకం ప్రధాన కారణాలుగా చెప్పుకోవచ్చు. కూలీల ఖర్చు అధికమవుట వలన రెండు మూడు సార్లు చేతితో కలుపు తీయించడం అంత లాభసాటిగా ఉండటం లేదు. చేతితో నాటిన వరిలో యంత్రాలతో కలుపు తీయడం కష్టముగా ఉంటుంది. కావున సకాలంలో తగిన మోతాదులో కలుపు మందులు వాడటం వలన తక్కువ ఖర్చుతోనే కలుపును నివారించుకోవచ్చును.



తుంగ



ఊద

## వరి నారుమడిలో కలుపు యాజమాన్యం :

మగాణి వరిలో నారుపోసిన తర్వాత సుమారు 25-30 రోజులకు ప్రధాన పొలంలో నాటుతారు. ఊద, వరి మొక్కలను పోలి ఉండటం వలన నారు పీకేటప్పుడు నారును ఊద నుండి వేరే చేయలేక ప్రధాన పొలంలో వరితో పాటు ఊదను కూడా నాటడం జరుగుతుంది. కాబట్టి నారు మడిలోనే ఊదను నివారించుకోవాలి. విత్తిన తర్వాత 12-15 రోజులప్పుడు నారుమడిలో కేవలం ఊద మొదలగు గడ్డి జాతి కలుపు మాత్రమే అధికంగా ఉంటే సైహలోఫాప్ పి-బ్యుటైల్ 10 శాతం ద్రావకం 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి నారుమడిలో పిచికారి చేసుకోవాలి. అలాకాక ఊద లాంటి గడ్డి జాతి మొక్కలతో పాటు ఆకు జాతి కలుపు కూడా ఎక్కువగా ఉంటే బిస్‌పైరిబ్యాక్ సోడియం 10 శాతం ద్రావకం 0.5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి నారుమడిలో పిచికారి చేయాలి.

## ప్రధాన పొలంలో కలుపు యాజమాన్యం :

మాగాణి వరిలో నాట్లు వేసిన తర్వాత 3-5 రోజుల లోపు కలుపు గింజలు మొలవక ముందే కలుపు మందులు వాడుకోవాలి.

- ప్రధాన పొలంలో ఊదలాంటి గడ్డిజాతి కలుపు మాత్రమే ఉన్నట్లయితే బ్యుటాక్లోర్ 50% ద్రావకం 1-1.5 లీటర్లు లేదా పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80 గ్రా. లేదా ప్రెటిలాక్లోర్

50% ద్రావకం 500 మి.లీ. మందును 25 కిలోల పొడి ఇసుకలో కలిపి ఎకరం పొలంలో పలచగా నీరును ఉంచి పొలమంతా సమానంగా చల్లుకోవాలి.

- పొలంలో ఊద లాంటి గడ్డి జాతి కలుపు మాత్రమే కాకుండా వెడల్పాటి ఆకులు గల కలుపు కూడా ఎక్కువగా ఉన్నట్లయితే పైన వివరించిన ద్రావకపు మందులు వాడరాదు. వాటికి బదులుగా బెన్‌సల్ఫ్యూరాన్ మిథైల్ + ప్రెటిలాక్లోర్ 5% గుళికలు 4 కిలోలును 25 కిలోల ఇసుకలో కలిపి పొలమంతా పలుచని నీటి పొరను ఉంచి సమానంగా పిచికారి చేయాలి.
- ఒకవేళ 15-20 రోజులప్పుడు గడ్డి మరియు వెడల్పాటి ఆకు కలుపు పైరులో అధికంగా ఉన్నట్లయితే 80-120 మి.లీ. బిస్‌పైరిబాక్ సోడియం మందును పైరుపై పిచికారి చేసి ఇంకా ఏదైనా కలుపు మిగిలి ఉంటే దానిని చేతితో ఏరి వేసుకోవాలి.
- 20-25 రోజులప్పుడు గనుక వెడల్పాటి ఆకులు మరియు తుంగ ఉన్నట్లయితే 2-4 డి సోడియం సాల్ట్ 2 గ్రా. లేదా 2-4 డి అమైన్ సాల్ట్ 2 మి.లీ. లేదా ఇథాక్సీ సల్ఫ్యూరాన్ 50 గ్రా. ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలి.
- 20-25 రోజులప్పుడు కేవలం గడ్డి జాతి కలుపు మాత్రమే ఉంటే ఫెనాక్సీప్రాప్ ఇథైల్ + సేఫనర్ 250 మి.లీ. ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలి.

**ఆరుతడి వరిలో కలుపు యాజమాన్యం :** వరిని వర్షాధారంగా పండించినప్పుడు లేదా వెదజల్లే వరిని సాగు చేసేటప్పుడు లేదా గొర్రుతో నేరుగా వరిని విత్తుకొని తరువాత నీరు సదుపాయం ఉన్నప్పుడు మాగాణీ వరిగా మార్చుకొనే సందర్భాలలో పొలాన్ని దమ్ము చేయకుండా పొడి దుక్కి చేస్తారు. ఈ పద్ధతిలో విత్తనం వెదజల్లిన తర్వాత 24-48 గంటల లోపు ఎకరానికి 200 లీ. నీటికి 1.5 లీ. పెండిమిథాలిన్ లేదా ప్రెటిలాక్లోర్ + సేఫనర్ (సోఫిట్) మందును 500 మి.లీ. ఒక ఎకరానికి చొప్పున నీటిలో కలిపి భూమిపై పిచికారి చేయాలి.

నీరు పెట్టి మాగాణి వరిగా మార్చుకొన్న తరుణంలో పైన వివరించిన ప్రధాన పొలంలో ఉపయోగించుకోవలసిన మందులు వాడుకోవాలి.

**యంత్రాలలో వరి నాట్లు వేసిన పొలంలో కలుపు నివారణ:**

యంత్రాల ద్వారా వరి నాట్లు వేసినప్పుడు కూడా 3 నుండి 5 రోజులలోపు ప్రెటిలాక్లోర్ 500 మి.లీ. లేదా 4 కిలోల లోండాక్స్ గుళికలు 25 కిలోల ఇసుకలో కలిపి పొలంలో పలుచగా నీటిని ఉంచి పొలమంతా సమానంగా పిచికారి చేయాలి. పంట పెరిగే దశలో మాగాణి వరి మాదిరిగానే కలుపు మందులు వాడుకో వచ్చును. వరుసల మధ్యన కోనోవీడర్ / పవర్ వీడర్ / గరుడ వీడర్ లాంటివి ఉపయోగించి కలుపును నివారించడం వలన వరి మొక్క కూడా బాగా పిలకలు తొడిగి ఏపుగా పెరుగుతుంది.

**దమ్ము చేసిన పొలంలో నేరుగా విత్తే పద్ధతి :**

- డ్రమ్ సీడర్‌తో గానీ, చేతిలో వెదజల్లే పద్ధతిలో గానీ దమ్ము చేసిన పొలంలో విత్తిన తర్వాత 4-5 రోజులప్పుడు 500 మి.లీ. ప్రెటిలాక్లోర్ + సేఫనర్ లేదా 80 గ్రా. పైరజోసల్ఫ్యూరాన్ మందును 25 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో నీరు పలుచగా ఉంచి పొలమంతా సమానంగా వెదజల్లాలి. ఇలా చేసిన తర్వాత పొలంలో 2-3 రోజుల వరకూ నీరు పెట్టకూడదు.
- ఒకవేళ ఈవిధంగా చేయడం కుదరకపోతే కలుపు అధికంగా ఉన్నప్పుడు గడ్డి జాతి కలుపు మాత్రమే ఉంటే 400 మి.లీ. సైహాలోఫాప్ బ్యుటైల్ మందు వాడుకోవాలి.
- ఒకవేళ గడ్డి జాతి మరియు వెడల్పాటి ఆకులు గల కలుపు రెండూ ఉన్నట్లయితే 80-120 మి.లీ. బిస్‌పైరిబాక్ సోడియంను పిచికారి చేసుకొని కలుపును నివారించుకోవచ్చును.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 98853 64406

రైతు సేవలో వివిధ ఆధునిక యాప్‌లు
అంగ్రూ అగ్రి, కృషి విజ్ఞాన్, ఆంగ్రూ చెరకు సాగు, వ్యవసాయ వాతావరణ సూచనలు, పశుపోషణ్, ఫర్టిలైజర్ కాలిక్యులేటర్, ఆర్.బి.కె. ఛానల్
ఈ యాప్‌లు వినియోగించుటకు స్మార్ట్ ఫోన్ కలిగిన వారు గూగుల్ ప్లే స్టోర్ నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చు

# వ్యవసాయ పరిశోధనా స్థానం, నెల్లూరి వారి నూతన సన్నగింజ వరి రకం ఎన్.ఎల్.ఆర్. 4001 (నెల్లూరి సిరి)

డా|| సి.హెచ్. శ్రీలక్ష్మీ, సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం); డా|| ఆర్. కృష్ణ నాయక్, సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం); డా|| యు. వినీత, సీనియర్ శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); డా|| జె. పరమశివ, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా|| పి. మధుసూధన్, సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం) మరియు డా|| పి. రాజశేఖర్, ప్రధాన శాస్త్రవేత్త & అధిపతి, వ్యవసాయ పరిశోధనా స్థానం, నెల్లూరు.





ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాలీనా 25 లక్షల హెక్టార్లలో వరి సాగవుతూ దక్షిణ భారతానికే ధాన్యాగారంగా పేరుగాంచింది. రాష్ట్రంలో అన్ని జిల్లాలలో వరిని సాగు చేస్తారు. నీటి లభ్యతను అనుసరించి శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగం, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలు మరియు రాయలసీమలో జిల్లాలైన కర్నూలు, అనంతపురాలలో వరకు జూన్ – జులై నెలలో ఖరీఫ్ పంటకాలం ప్రారంభమవుతుంది. గుంటూరు, ప్రకాశం జిల్లాలలో ఆగష్టు నెలలో ఖరీఫ్‌ను ప్రారంభిస్తారు. ఈశాన్య ఋతుపవన ప్రాబల్యం అధికంగా ఉన్న నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో మాత్రం ఖరీఫ్‌ను ముందస్తుగానే అంటే ఏప్రిల్ – మే నెలల్లో ప్రారంభించి ఆగష్టు నెలాఖరున పంటను కోయడం జరుగుతుంది. దీనిని బట్టి వరి సాగులో మన రాష్ట్రంలో ఉన్న వైవిధాన్ని అర్థం చేసుకోవచ్చు. నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంతంలో సాగు చేసే రైతాంగం ముఖ్యంగా 145 రోజులకు కోతకు వచ్చే ఎన్.ఎల్.ఆర్. 145 (స్వర్ణముఖి) లాంటి రకాలను అధికంగా సాగు చేయడం జరుగుతున్నది. కారణాలేవైనా ప్రస్తుతం సన్న గింజ రకాలకే మార్కెట్‌లో ప్రాధాన్యత ఉన్నది. కాబట్టి రైతాంగం అలాంటి వాటినే సాగు చేయడానికి అధికంగా మొగ్గు చూపుతున్నారు.

వ్యవసాయ పరిశోధనా స్థానం, నెల్లూరులో ఎడగారు, లేట్ ఖరీఫ్ మరియు రబీ కాలాలకు అనువైన రకాల రూపకల్పన కొరకై పరిశోధనలు జరుగుతున్నవి. వీటి ఫలితంగా తయారు చేయబడిన రకమే ఎన్.ఎల్.ఆర్. 4001. ఈ రకాన్ని నెల్లూరు సిరి అనే పేరుతో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు 2020 వ సంవత్సరంలో విడుదల చేయడం జరిగింది. ఈ రకం 140–145 రోజులకు కోతకు వచ్చి మెడ విరుపును, కొంత వరకు దోమ పోటునూ తట్టుకుంటుంది. గింజ నాణ్యత సన్నగా ఉంటుంది. ఎన్.ఎల్.ఆర్. 4001 రకాన్ని ఎన్.ఎల్.ఆర్. 145 (స్వర్ణముఖి) × యం.టి.యు. 5249 (వజ్రం) రకాలను సంకరపరచి రూపొందించడం జరిగింది.

ఈ రకాన్ని 2014 వ సంవత్సరం నుండి 2019 వరకు వివిధ దిగుబడి పరీక్షలలో ప్రామాణిక రకంతో పోల్చి చూపినపుడు సుమారు 12 శాతం అధిక దిగుబడినిచ్చినట్లుగా గుర్తించడం జరిగింది. ఈ రకం లక్షణాలను గమనించినట్లయితే

పైరు 90 సెం.మీ. వరకు పొడవు పెరుగుతుంది. మొక్క నిటారుగా ఉండి ఆకులన్నీ మధ్యస్థ హరిత వర్ణంలో ఉంటాయి. ఈ రకం పోటాకు దాదాపు 35 సెం.మీ. వెడల్పు 1.7 సెం.మీ. గా ఉంటుంది. ఈ రకం పూతకు రావడానికి సుమారు 100-110 రోజులు పడుతుంది. మొక్కలో వెన్ను దాదాపు 18-20 సెం.మీ. వరకూ పొడవు ఉండి ఒక్కో వెన్నులో సుమారు 250 నుండి 300 వరకూ గింజలుంటాయి. గుబురులో పిలకల సంఖ్యను చూసినట్లయితే భూమి స్వభావాన్ని బట్టి 14 వరకూ పిలకలు వేస్తుంది.

గింజ నాణ్యతను పరిశీలించినట్లయితే, గింజలు సన్నగా, మధ్యస్థంగా ఉంటాయి. గింజ పొడవు 7.9 మి.మీ. గాను వెడల్పు 2.1 మి.మీ. గాను ఉంటుంది. ఆడించిన తర్వాత వచ్చిన బియ్యం యొక్క పొడవు, వెడల్పుల నిష్పత్తి 2.79 గా ఉంటుంది. 100 కిలోల వడ్లను మర పట్టించినప్పుడు వచ్చే బియ్యం శాతం 64% గా గుర్తించడం జరిగింది. వెయ్యి గింజల బరువు 15.2 గ్రా. గా ఉంటుంది. అన్నం వండిన తర్వాత సాగే గుణం బాగా ఉండి, అమైలోజ్‌ను 24 గా గుర్తించడం జరిగింది. స్థూలంగా చెప్పాలంటే అన్నం నాణ్యత బాగుంటుంది.

పదకొండు సంవత్సరాల పాటు జరిగిన వివిధ దిగుబడి పరీక్షలలో ఈ రకం సరాసరి 6254 కిలోలు / హెక్టారుగా నమోదుకావడం జరిగింది. అదే సమయంలో ప్రామాణిక రకం యొక్క దిగుబడి సామర్థ్యము 5490 కిలోలు / హెక్టారుగా గుర్తించడం జరిగింది. ఈ రకాన్ని చిరుసంచుల ప్రదర్శనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలలో పరీక్షించడం జరిగింది. 3 సంవత్సరాల పాటు, 635 రైతుల క్షేత్రాలలో జరిగిన ఈ చిరుసంచుల ప్రదర్శనలో ఎన్.ఎల్.ఆర్. 4001 యొక్క దిగుబడి సామర్థ్యము 6691 కిలోలు / హెక్టారుగాను, ప్రామాణిక రకం యొక్క దిగుబడి సామర్థ్యము 6076 కిలోలు గానూ గమనించడం జరిగింది. అనగా ఎన్.ఎల్.ఆర్. 4001 రకం ప్రామాణిక రకం కన్నా దాదాపు 10% అధిక దిగుబడినిస్తున్నట్లుగా గుర్తించడం జరిగింది.

ఈ రకాన్ని ఖరీఫ్ కాలంలో అంటే జూన్ - జులై నెలల్లో వేసుకొంటే 150 రోజులకు కోతకు వస్తుంది. ఆగష్టు - సెప్టెంబరు నెలల్లో వేసుకొంటే 140 రోజులకు కోతకు వస్తుంది. నీటి లభ్యతను బట్టి అక్టోబరు నెలాఖరు వరకూ రకాన్ని కూడా నార్లు పోసుకోవచ్చు. అంటే రబీ పంటగా కూడా ముందస్తు నారు అంటే అక్టోబరు చివరి వరకూ నార్లు వేసుకోవాలి. అనుకూలమైన రకము. ఇన్ని సుగుణాలున్నాయి కాబట్టి ఇప్పటికే కోస్తా ప్రాంతంలో రైతులు ఈ రకాన్ని అధిక విస్తీర్ణంలో సాగు చేయడం జరుగుతూ ఉన్నది.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : **90007 11209**



# నువ్వు పంట సాగులో మెళకువలు

డా॥ టి. తులసి లక్ష్మీ, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) & అధిపతి; డా॥ ఎ.బి.యం. శిరీష, శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం) మరియు డా॥ ఎస్.కె. హసీన భాను, శాస్త్రవేత్త (మొక్కల తెగుళ్ళ శాస్త్రం), వ్యవసాయ పరిశోధనా స్థానం, యలమంచిలి.



**నూ**నె గింజలలో నువ్వులు చాలా ప్రధానమైన పంట. నువ్వులో నూనె 45-55 శాతం వరకూ ఉంటుంది. అంతేకాక సెసామిన్, సెస మొలిన్ అనే రసాయనాలు ఉండటం వలన ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. విటమిన్ "ఇ" ఎక్కువగా ఉండడం వలన నువ్వులు నూనె చర్మానికి మంచిది. $25^0$-$37^0$ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో నువ్వు పంట మంచి ఎదుగుదలను మరియు అభివృద్ధిని కనపరుస్తుంది.

ఉష్ణోగ్రత $11^0$ సెంటీగ్రేడ్ కన్న తక్కువ ఉన్నట్లయితే విత్తనం మొలకెత్తదు. అలాగే పుష్పించే దశలో అధిక ఉష్ణోగ్రతలు ($40^0$ సెంటీగ్రేడ్) ఉంటే ఫలధీకరణ జరగదు.

**నేలలు :** నీరు నిల్వ ఉండని తేలిక నేలలు అనుకూలం. ఆమ్ల మరియు క్షార నేలలు పనికిరావు.

**పంట కాలం :** రబీ, వేసవి కాలంలో డిసెంబర్ 15 నుండి జనవరి వరకూ అనుకూలం. మంచు ఎక్కువగా ఉండి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పుడు జనవరి నెలాఖరు వరకూ వేసుకోవచ్చు. మంచు కురుస్తున్నప్పుడు, నువ్వు విత్తనాలు వేయరాదు.

**రకాలు :**

**రకం :** ఎలమంచిలి 11

**సగటు దిగుబడి :** ఎకరానికి 300-400 కిలోలు

**నూనె శాతం :** 52.5%

**పంట కాలం :** 80 నుంచి 85 రోజులు. ఖరీఫ్ మరియు రబీ కాలాలకు అనుకూలం.

**రకం :** ఎలమంచిలి 17

**సగటు దిగుబడి :** ఎకరానికి 350-450 కిలోలు

**నూనె శాతం :** 52.5%

**పంట కాలం :** 70 నుంచి 75 రోజులు. ఆకుమచ్చ తెగులును కొంత వరకూ తట్టుకొంటుంది. ఖరీఫ్ మరియ రబీ కాలాలకు అనుకూలం.

**రకం :** ఎలమంచిలి 66

**సగటు దిగుబడి :** ఎకరానికి 500-600 కిలోలు

**నూనె శాతం :** 51.5%

**పంట కాలం :** 80 నుంచి 85 రోజులు.

**విత్తన మోతాదు :** ఎకరానికి 2.5 కిలోలు, మాంకోజెబ్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలి. విత్తనానికి సమపాళ్ళలో ఇసుక కలిపి చల్లుకోవాలి.

**నేల తయారీ :** విత్తుటకు ముందు నేలను మెత్తగా దుక్కి చేయాలి. నేలను 20-25 సెం.మీ. లోతు వరకు దున్నుకోవడం వలన మొక్కలకు అందవలసిన తేమ మరియు పోషకాలను అందించవచ్చు.

**ఎరువులు ఎకరానికి :**

| | | |
|---|---|---|
| పశువుల ఎరువు | - | 4 టన్నులు |
| నత్రజని | - | 16 కిలోలు |
| భాస్వరం | - | 8 కిలోలు |
| పొటాష్ | - | 8 కిలోలు |

నత్రజనిలో సగ భాగం, మొత్తం భాస్వరం, పొటాష్ ఎరువులు ఆఖరి దుక్కిలో పశువుల ఎరువుతో పాటు వేయాలి. నత్రజని సగ భాగం విత్తిన 30 రోజులకు వేసి నీరు పెట్టాలి.

**నీటి యాజమాన్యం :** నువ్వు పంట నీటి ఎద్దడిని తట్టుకోగలదు.

ఒకసారి పంట కుదురుకున్నాక ఎంతటి బెట్ట పరిస్థితులనైనా తట్టుకోగలదు. అధిక దిగుబడి పొందడానికి విత్తిన వెంటనే మొదటి తడి ఇవ్వాలి. పూత దశ, కాయ అభివృద్ధి మరియు గింజ కట్టు దశలో తడులు ఇవ్వాలి.

**సస్యరక్షణ :**

**రసం పీల్చే పురుగులు :**

**తామర పురుగులు (దోమ) :** పిల్ల, తల్లి పురుగులు ఆకులు అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చి వేస్తాయి. పురుగులు ఆశించిన ఆకులు ముందుగా పాలిపోయి తరువాత ఎండిపోతాయి.

**తెల్ల నల్లి :** ఈ నల్లి ఆశించిన ఆకులు ముదురు ఆకుపచ్చ రంగుకు మారి ఈనెలు పొడవుగా సాగు క్రింది వైపునకు ముడుచుకోనిపోయి, దోనె ఆకారంగా మారి పాలిపోతాయి.

**నివారణ :** మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. తెల్లనల్లి నివారణ డైకోఫాల్ 5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

**ఆకు ముడత మరియు కాయ తొలుచు పురుగు :** తొలి దశలో గొంగళి పురుగులు లేత ఆకులను కలిపి గూడు కట్టి లోపలి నుండి ఆకుల్లోని పచ్చని పదార్థాన్ని గోకి తినుట వలన ఆకులు ఎండిపోతాయి. పురుగులు ఎదిగిన కొలది ఎక్కువ ఆకులను కలిపి గూడుగా చేసి ఆకులను తింటాయి. మొగ్గ ఏర్పడే దశలో మొగ్గలను, పూతను, కాయల్లోని లేత గింజలను తింటూ పంటకు నష్టం చేస్తాయి.

**నివారణ :** మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

**వెర్రి తెగులు / పుట్ట జుత్తు / ఫిల్లోడి :** ఈ తెగులు పూత సమయంలో ఆశిస్తుంది. సాధారణంగా ఆలస్యంగా వేసిన పంటలో ఎక్కువగా వస్తుంది. తెగులు సోకిన మొక్కల్లో ఆకులు చిన్నవై పువ్వులోని భాగాలన్నీ ఆకుల మాదిరిగా మారిపోయి కాయలు ఏర్పడవు. మొక్కల ఎదుగుదల తగ్గి పైభాగం చిన్న ఆకులు గుబురుగా ఉండి వెర్రితల మాదిరిగా ఉంటుంది. ఈ తెగులు దీపపు పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

**నివారణ :** తెగులు కనిపించిన వెంటనే తెగులు సోకిన మొక్కలను పీకి తగలబెట్టాలి. పైరుపై మిథైల్ డెమటాన్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**వేరుకుళ్ళు, కాండంకుళ్ళు తెగులు :** కాండం మీద నల్లని చారలేర్పడతాయి. వేర్లను చీల్చి పరిశీలిస్తే గోధుమ రంగు చారలు కనిపిస్తాయి. వేర్లు పూర్తిగా లేదా పాక్షికంగా కుళ్ళిపోతాయి. ఎండు తెగులు సోకిన కాండం మీద, కాయల మీద గులాబీ రంగు శిలీంధ్ర బీజాలు కనిపిస్తాయి. తెగులు కలిగించే శిలీంధ్రం, భూమిలోను విత్తనాలు మరియు పంట అవశేషాల మీద జీవిస్తుంది.

**నివారణ :** పంట మార్పిడి తప్పక చేయాలి. కిలో విత్తనానికి 3 గ్రా. కాప్టాన్ లేదా కార్బండెజిమ్ చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కల మొదళ్ళలో పిచికారి చేసుకోవాలి.

**ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు :** మొక్క ఎదిగే దశలో గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఎక్కువగా వ్యాపిస్తుంది. ఆకులపై కాండం మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. ముదురు గోధుమ రంగు చిన్న చిన్న వలయాకారపు మచ్చలు ఆకు అంతా వ్యాపించి ఆకులు ఎండిపోతాయి.

**నివారణ :** కిలో విత్తనానికి 3 గ్రా. చొప్పున కార్బండెజిమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. పంట మీద తెగులు ఉన్నప్పుడు కార్బండెజిమ్ 1 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**బూడిద తెగులు :** లేత ఆకులపై తెల్లని బూడిద వంటి పదార్థ మచ్చలు ఏర్పడతాయి. తెగులు సోకిన ఆకులు మాడి రాలి పోతాయి.

**నివారణ :** నీటిలో కరిగే గంధకపు పొడి 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి చల్లుకోవాలి.

**పంట కోత నిలువలు :** పంట పసుపు రంగుగా మారినప్పుడు కాయల్లో గింజలు నలుపుగా మారినపుడు కోయాలి. ఎండలో ఆరబెట్టి గింజలను వేరు చేయాలి. విత్తనం కొరకు పండించినప్పుడు 40° సెంటీగ్రేడ్ అంతకు మించిన ఎండలో ఆరబెట్టరాదు. మొలక శాతం తగ్గుతుంది. ఎక్కువ కాలం నిలువ చేయడానికి బూడిద కిలో విత్తనానికి 25 గ్రా. చొప్పున లేదా వేపనూనె కిలో విత్తనానికి 25 మి.లీ. చొప్పున కలిపి నిలువ చేయాలి. రసాయన మందులు, పురుగులు మందులు ఎట్టి పరిస్థితులోను కలపరాదు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 89853 70076

# వై.యస్.ఆర్. ఉచిత పంట భీమా - వ్యవసాయ అభివృద్ధి

డా॥ జి .రఘునాధ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (ఆర్ధిక శాస్త్రం); ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం,
డా॥ ఎం. చంద్రశేఖర్ రెడ్డి, శాశ్వత కార్యనిర్వహక సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ అగ్రిమిషన్,
బి. మెహెర్ గీత, సీనియర్ రీసెర్చ్ ఫెలో, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం.

**భా**రతదేశ వ్యవసాయ రంగం కరువు, వరదలు మరియు వాతావరణ మార్పులకు గురవుతూ ఉంది. వ్యవసాయ వడి దుడుకులను తగ్గించడానికి సమర్ధవంతమైన యంత్రాంగాలలో బలమైన భీమా వ్యవస్థ ముఖ్యమైనది. పంటల భీమా అనేది వివిధ నష్టాల వల్ల పంటలు దెబ్బతినడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాలను తగ్గించడానికి ఉద్దేశించిన ఒక ఏర్పాటు. పంటల భీమా చరిత్ర స్వాతంత్ర్యానికి ముందు మొదలు కొని, అక్టోబర్ 1965 లో భారత ప్రభుత్వం క్రాప్ ఇన్సూరెన్స్ బిల్లు మరియు మోడల్ ఇన్సూరెన్స్ స్కీమ్ గాను, 1972-78 లో ప్రయోగాత్మకంగా మొదటి వ్యక్తిగత అప్రోచ్ స్కీమ్ గాను, 1985-86 లో దేశవ్యాప్త సమగ్ర పంట భీమా పథకం గాను, 1999-2000 లో జాతీయ వ్యవసాయ భీమా పథకం గాను, 2009 లో మొదటిసారిగా వాతావరణ ఆధారిత పంటల భీమా పథకాన్ని గాను మరియు 2016 లో ప్రధాన మంత్రి పంటల భీమా యోజన గాను వృద్ధి చెందింది. ప్రస్తుతం అమలు అవుతున్న ప్రధాన మంత్రి పంటల భీమా యోజనలో, కొన్ని కంపెనీలు మరియు వ్యవసాయ ఇన్సురెన్స్ కార్పోరేషన్ అనవసరమైన సంపన్నతలు, కంపెనీలు గత సంవత్సర కార్యకలాపాలు జరిపిన ప్రాంతాలను విడిచి కొత్త ప్రాంతాలకు వెళ్తున్నాయి, పంట కోత ప్రయోగాలలో అనవసరమైన జోక్యం, అధిక ప్రీమియం రేటు, కొన్ని రాష్ట్రాలలో క్లెయిమ్ మరియు ప్రీమియం నిష్పత్తి ఎక్కువగా ఉండడం మరియు రుణదాత రైతులకు తప్పనిసరి కాకుండా స్వచ్ఛందంగా పథకంలో పాల్గొనడం వంటివి ప్రధాన కార్యనిర్వాహక లోపాలుగా చర్చకెక్కాయి. ఈ కారణాల చేత ఎనిమిది ప్రధాన రాష్ట్రాలు (పశ్చిమ బెంగాల్, బీహార్, పంజాబ్, తమిళనాడు, జార్కండ్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ మరియు తెలంగాణ) ప్రధాన మంత్రి పంటల భీమా యోజనని నిలిపివేసాయి, ఇంకా నాలుగు రాష్ట్రాలు (ఉత్తర ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ మరియు మహారాష్ట్ర) కొనసాగించాలా వద్దా అని ఆలోచిస్తున్నాయి. మొత్తం 18 కంపెనీలలో (ప్రైవేట్ లేదా ప్రభుత్వ రంగ భీమా కంపెనీలు) 10 కంపెనీలు మాత్రమే 2020-21 సంవత్సరంలోపాల్గొన్నాయి. ఈ సమస్యల నేపథ్యంలో, కొత్త ఆలోచనలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంట భీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం క్రింద రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రీమియం మొత్తం చెల్లించడంతో పాటు క్లెయిమ్‌లను ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో పరిష్కరిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2019 నుండి ప్రజల సంక్షేమం కోసం సకాలంలో వృద్ధాప్య పెన్షన్, ఆరోగ్య సంరక్షణ, గృహ సౌకర్యాలు, ఉచిత పంటల భీమా, రైతు భరోసా మొదలైన పథకాలను వైఎస్ఆర్ నవరత్నాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్న అంశాన్ని దేశ ప్రజలందరూ హర్షిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో 8 జూలై 2019 న వై.ఎస్.ఆర్. రైతు దినోత్సవం సందర్భంగా డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉచిత పంట భీమా పథకం "నవరత్నాలు" లో భాగంగా ప్రకటించబడింది. రాష్ట్రంలోని నోటిఫైడ్ పంటలను పండించే రైతులందరికి పంట నష్టం జరిగితే క్లెయిమ్‌లు ఆలస్యం చేయకుండా పరిష్కరించడం ద్వారా రైతులు తదుపరి పంటలో పెట్టుబడి పెట్టగలిగేలా చూడాలనే లక్ష్యంతో, ఖరీఫ్ 2019 నుండి ఈ పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని నోటిఫైడ్ పంటలన్నీ ఒక రూపాయి టోకెన్ చెల్లించి రైతు భరోసా కేంద్రంలో ఇ-క్రాప్ బుకింగ్ లో నమోదు చేయడం ద్వారా ఈ పథకం పరిధిలోకి వస్తారు. ఈ రూ. 1 టోకెన్ మొత్తం కూడా ఖరీఫ్ 2020-21 నుండి మినహాయించబడింది మరియు

ఉచిత పంట భీమా పథకంగా ప్రకటించబడింది. ఈ పథకం ప్రతి నోటిఫైడ్ పంట కింద మండల భీమా యూనిట్ గా నిర్వచించబడిన ప్రాంతాల్లో పనిచేస్తోంది (ఇది గ్రామ స్థాయికి గ్రామ భీమా యూనిట్ గా విస్తరించాలి, తద్వారా చిన్న ప్రాంత రైతుల నష్టాల కవరేజ్ మరింత ప్రతినిధిగా ఉంటుంది. పథకం ప్రవేశపెట్టిన తర్వాత 2019 లో పంటల భీమా కోసం నమోదు చేసుకున్న రైతుల సంఖ్య గత మూడు సంవత్సరాల సగటుతో పోల్చగా, 247.56 శాతం పెరగడం హర్షనీయం. నమోదు చేసుకున్న రైతుల సంఖ్య 2018 లో 28.70% నుండి 2019 లో 58.43% మరియు ఖరీఫ్ 2020-21లో 55.79% కి పెరిగింది. ఉచిత పంట భీమా పరిధిలోకి వచ్చే ప్రాంతం 2018 లో 25.88% నుండి 2019 లో 63.07% కి పెరిగింది మరియు భీమా మొత్తం రూ. 11291.8 కోట్ల నుంచి రూ. 29875.27 కోట్లు (162 శాతం) పెరిగింది. 2018-19లో 38.07% నుండి 2019-20 లో ప్రీమియంలో రాష్ట్ర వాటా 68.41% కి పెరిగింది, ఎందుకంటే రైతుల ప్రీమియం మొత్తం వాటా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా చెల్లిస్తోంది. ఇది రైతుల భాగస్వామ్యం పెరగడానికి దారితీసింది, తద్వారా వారిపై ఒత్తిడి ఉండదు. ఉచిత పంటల భీమా పథకాన్ని ప్రారంభించడానికి ముందు రైతులు, రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వం ప్రీమియంలో తమ వాటాను చెల్లించాల్సి ఉంటుంది (ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన క్రింద) మరియు ఎవరైనా ఆలస్యం చేస్తే భీమా రక్షణ కోల్పోతారు. అందువల్ల,

**ఆంధ్రప్రదేశ్‌లో 2016-17 నుండి ఖరీఫ్ 2020-21 వరకు పంటల భీమా వివరాలు :**

| వివరాలు | 2016-17 | 2017-18 | 2018-19 | సగటు | 2019-20 | ఖరీఫ్ 2020-21 |
|---|---|---|---|---|---|---|
| పథకం పరిధిలోకి వచ్చిన రైతుల సంఖ్య (లక్షల్లో) | 17.57 (20.61) | 18.31 (21.48) | 24.47 (28.70) | 20.12 | 49.81 (58.43) | 47.56 (55.79) |
| విస్తీర్ణం (లక్ష హెక్టార్లలో) | 15.59 (21.01) | 20.66 (27.75) | 18.89 (25.88) | 18.38 | 45.96 (63.07) | 35.75 (61.63) |
| భీమా మొత్తం (రూ. కోట్లు) | 8648 | 10798 | 11291 | 10246 | 29875 | 27230 |
| రైతు ప్రీమియం (రూ. కోట్లు) | 199.84 (24.86) | 248.76 (19.55) | 261.78 (23.92) | 236.79 | 0.26 (0.01) | శూన్యం |
| ప్రీమియంలో కేంద్ర వాటా (రూ. కోట్లు) | 301.87 (37.56) | 511.64 (40.22) | 416.55 (38.07) | 410.02 | 586.06 (31.57) | - |
| ప్రీమియంలో రాష్ట్ర వాటా (రూ. కోట్లు) | 301.87 (37.56) | 511.64 (40.22) | 416.55 (38.07) | 410.02 | 1270.01 (68.41) | 1848.59 (100) |
| స్థూల ప్రీమియం (రూ. కోట్లు) | 803.59 | 1272.08 | 1094.02 | 1056.56 | 1856.32 | 1848.59 |
| చెల్లించిన క్లెయిమ్లు (రూ. కోట్లు) | 943.77 | 740.18 | 1885.06 | 1189.67 | 1968.00 | 1820.23 |
| ప్రయోజనం పొందిన రైతుల సంఖ్య (లక్షల్లో) | 8.98 (51.11) | 7.14 (38.99) | 16.17 (66.08) | 10.76 | 15.67 (31.46) | 15.15 (31.84) |
| క్లెయిమ్లకు వ్యతిరేకంగా ప్రీమియం నిష్పత్తి | 1.17 | 0.58 | 1.72 | 1.15 | 1.06 | 0.98 |

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భీమా కంపెనీల పనిని నిర్వహించాలని నిర్ణయించుకుంది మరియు ప్రధానంగా రైతు భీమా అవసరాలను తీర్చడానికి 100 శాతం ప్రభుత్వ యాజమాన్యంతో "ఆంధ్రప్రదేశ్ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్" ను ప్రారంభించాలని నిర్ణయించింది. కొత్త వ్యవస్థ ప్రధాన మంత్రి పంట భీమా యోజన నిబంధనలకు సరిపోనందున, అందువల్ల ఖరీఫ్ 2020-21 సీజన్‌లకు వాటా చెల్లించడానికి కేంద్రం నిరాకరించింది. ఖరీఫ్ 2020-21 నుండి కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ప్రీమియం వాటాను కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే చెల్లించి భీమా సెటిల్‌మెంట్ ప్రారంభించింది.

**గమనిక :**

- కుండలీకరణాల్లోని గణాంకాలు ఆ పరిమితుల మొత్తానికి శాతాన్ని సూచిస్తాయి,
- ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం రైతుల సంఖ్య 85.24 లక్షలుగా పరిగణించబడింది
- ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం విస్తీర్ణం 2016-17 నుండి 2019-20 వరకు 74.18, 74.45, 72.97 మరియు 72.87 లక్షల హెక్టార్లు.
- ఖరీఫ్ 2020-21 సంఖ్యా వివరాలు ఇంకా మెరుగుపరచ బడలేదు మరియు ఖరారు చేయబడలేదు.
- కుండలీకరణాల్లోని గణాంకాలు పథకం పరిధిలో ఉన్న రైతులకు ఎంత శాతం మంది రైతులు లబ్ధి పొందారో సూచిస్తున్నాయి.

సంక్షేమ క్యాలెండర్‌లో పేర్కొన్న విధంగా, 2021 మే 25 న దిగుబడి ఆధారిత 21 పంటలు మరియు వాతావరణ ఆధారిత 9 పంటలు, ఖరీఫ్ 2020-21 లో 35.75 లక్షల హెక్టార్లలో (47.56 లక్షల రైతులు రూ. 27230 కోట్ల భీమా మొత్తాన్ని) ఉచిత పంటల భీమా పథకం పరిధిలోకి చేర్చబడ్డాయి. పంట కోత ప్రయోగాల నుండి పొందిన ఫలితాల ఆధారంగా 15.15 లక్షల మంది రైతులు రూ. 1820 కోట్లతో ఈ పథకం క్రింద 2020-21 కి గాను ప్రయోజనం పొందారు. వ్యవసాయం కోసం ఉచిత విద్యుత్, ధాన్యం సేకరణ కేంద్రాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, వై.ఎస్.ఆర్. రైతు భరోసా పథకాలు వంటి సంభావ్య వ్యవసాయ కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ ఉధృతికి కారణమని చెప్పవచ్చు మరియు ఉచిత పంట భీమా కింద ప్రయోజనం పొందిన రైతుల (2018-19లో 66.08% నుండి 2019-20లో 31.46%) తగ్గుదలకు దారి తీసింది. రైతు భరోసా కేంద్రాలు ద్వారా ప్రభుత్వం అందించిన మద్దతు వలన 2019-20 లో ఆహార ధాన్యం ఉత్పత్తి 17 శాతం అంటే 2018-19 లో 149.56 లక్షల టన్నుల నుండి 2019-20 లో 175.12 లక్షల టన్నులకు, 2020-21 లో 166.60 లక్షల టన్నులకు పెరుగుదల గమనార్హం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 24 పంటల (పసుపు, మిరప కాయలు, ఉల్లిపాయలు, చిరుధాన్యాలు, వరి, జొన్నలు, సజ్జలు, రాగి, మొక్కజొన్న, శనగలు, మినుములు, కంది, పెసర, వేరుశనగ, సోయాబీన్, పొద్దుతిరుగుడు, కొబ్బరి, పత్తి, అరటి మరియు నారింజ) ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించింది మరియు ఇ-క్రాప్ బుకింగ్ ఆధారంగా రాష్ట్రంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో (10778) పంట సేకరణ అందుబాటులో ఉండేలా చేసింది. ప్రభుత్వం ధర స్థిరీకరణ నిధి కింద రూ. 3,154 కోట్లతో 2019-20 లో వివిధ పంటలకు లాభదాయకమైన ధరలను అందించడం వలన వాణిజ్య పోటీ పెరిగి, రైతులు రూ. 8000-9000 కోట్లు ప్రయోజనం పొందారు. పంట విత్తినప్పటి నుండి ఉత్పత్తుల అమ్మకం వరకు రైతులకు సంబంధించిన అన్ని కార్యకలాపాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను "ఒక స్టాప్ సెంటర్" గా రూపొందించింది. ఇప్పుడు రైతు భరోసా కేంద్రాలలో పంట సాగుదారుల హక్కుల కార్డును ప్రవేశపెట్టడం ద్వారా ఒక మంచి కౌలు-భూస్వామి సంబంధాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి, దీని ద్వారా కౌలు రైతు బ్యాంకు రుణాలు, ఇన్‌పుట్‌లు మరియు ఇతర సబ్సిడీలను పొందే అవకాశం లభించింది. గత రెండు సంవత్సరాలలో 16 లక్షల మంది కౌలు రైతులలో, 6.87 లక్షల కౌలు రైతులకు పంట

సాగుదారుల కార్డులు ఇవ్వబడ్డాయి మరియు ఈ సంవత్సరం మరో 5 లక్షల కౌలు రైతులకు సాగుదారు హక్కుల కార్డ్లు జారీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కౌలు రైతులతో సహా రైతులందరూ పంట భీమా సౌకర్యాన్ని పొందడానికి రైతు భరోసా కేంద్రాల వద్ద ఇ-క్రాప్ బుకింగ్ లో నమోదు చేసుకోవాలని అధికారులు కోరడమైనది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల సంక్షేమ కార్యకలాపాల బాధ్యతను భుజానికెత్తుకుని వారికి ఆర్థిక భారం నుండి ఉపశమనం కలుగజేసి, సంస్థాగత ఆవిష్కరణల ద్వారా మరియు భీమా వారికి క్లెయిమ్‌ల నిశ్చయతతో భరోసా ఇచ్చింది. ప్రీమియంలో రైతుల వాటా మొత్తం రైతుల తరపున రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది మరియు పంట సీజన్ చివరిలో తక్షణ క్లెయిమ్ సెటిల్‌మెంట్ జరుగుతుంది, ఇది భీమా క్లెయిమ్ సెటిల్‌మెంట్ చరిత్రలో గుర్తించబడింది. యాజమాన్య హక్కులకు భంగం కలుగకుండా కౌలు రైతులకు క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు జారీ చేయడం ద్వారా నిజమైన సాగుదారులకు భీమా ప్రయోజనాన్ని అందించే ఒక వినూత్న మార్గం రాష్ట్రంలో అమలు జరుగుతుంది. రైతులుకు ఇన్ని లాభాలు చేకూర్చిన ఉచిత పంట భీమా, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృద్ధికి దోహదపడిందని చెప్పక తప్పదు.

**భవిష్యత్ మార్గం :**

- రైతులకు భరోసా ఇవ్వడానికి దిగుబడి ఆధారిత భీమా కింద, నిర్దిష్ట గ్రామంలో పండించే ప్రధాన పంటలను చేర్చాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఒక్క ప్రధాన పంటను మాత్రమే గ్రామ పరిధికి అనుమతిస్తున్నారు. పంటల వైవిధ్యీకరణకు వెళ్లడానికి రైతులను ప్రోత్సహించడానికి ఇది మంచి మార్గం కాగలదు.
- మార్కెట్ భీమా అమలు చేయటంద్వారా ముందుగా నిర్ణయించే ధరలతో పంటలను సేకరించడం ద్వారా ధరల ప్రమాదాన్ని దాటవచ్చు. ఈ విధంగా భీమా రంగంలో ముందుకు సాగె మార్గాలని ప్రారంభించి రైతులలో పంటలనుపండించాడనికి విశ్వాసాన్ని పెంపొందించాలి.
- ఆంధ్రప్రదేశ్ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రస్తుతం ఉన్న సంస్థాగత పరిధి కంటే మెరుగ్గా పనిచేస్తుందని భావిస్తు, ఇలాంటి మంచి సంస్థను తీసుకురావడానికి ప్రయత్నాలు జరపాలని ఆశించడం జరుగుతుంది.
- ప్రధాన మంత్రి పంట భీమా యోజనలో రూపొందించబడిన విధంగా, తీవ్రమైన చీడపీడలు/ క్రిములు దాడి వల్ల సంభవించే పంట నష్టాల నుండి నిర్దిష్ట ప్రాంత రైతులను కాపాడానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఆశించడమైనది.
- ఇంతకుముందు రైతులు భీమా కింద పంటలను నోటిపై చేయడానికి క్లిష్టతరమైన విధానాన్ని అనుసరించాల్సి ఉండేది, కానీ ఇప్పుడు వారు ఇ-క్రాప్ బుకింగ్ ద్వారా ఉచిత పంట భీమా కింద నేరుగా అర్హులయ్యారు, ఇది రైతులచే ప్రశంసించ బడింది. కాబట్టి, రైతుల ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం ప్రస్తుత పథకాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది.
- భూ యాజమాన్య హక్కులను కాపాడే ప్రక్రియ మరియు కౌలు రైతులకు పంట సాగు దారు హక్కుల కార్డ్ ద్వారా ప్రయోజనాలను అందించే ప్రక్రియను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం బాగా ప్రశంసించింది, ఈ విధంగా కౌలు సాగుదారులకు ప్రభుత్వం మరింత ప్రయోజనాలను వర్తింపచేయడాన్ని కొనసాగించవలెను.
- పంటల భీమా పరిధిలోనికి ఎక్కువ మంది రైతులను చేర్చడానికి ప్రభుత్వ ప్రయత్నాలు కొనసాగించాలి.
- ఈ- క్రాప్ బుకింగ్ మరియు సమగ్ర భూ సర్వే ద్వారా ఖచితమైన సర్వే నంబర్లను అనుసరించి, కౌలు రైతులకు పంట సాగుదారు హక్కుల కార్డు విధానాన్ని అమలుపరుస్తూ మరియు ఆంధ్రప్రదేశ్ జనరల్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ నిర్వహణ ద్వారా ఉచిత పంట భీమా పథకాన్ని సక్రమముగా నిర్వహించిన యెడల రాష్ట్రరైతులకు సంపూర్ణ రక్షణ మరియు ప్రయోజనాలు కలుగుటకు మెండుగా అవకాశం గలదు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 98483 21232

# శనగ పంటను ఆశించే తెగుళ్ళు మరియు వాటి యాజమాన్యం

డా॥ బి. హెచ్. చైతన్య, శాస్త్రవేత్త (తెగుళ్ళ శాస్త్రం); డా॥ వి. జయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం); డా॥ జె. మంజునాథ్, సీనియర్ శాస్త్రవేత్త (కీటక శాస్త్రం) మరియు డా॥ ఎస్. రమాదేవి, శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల.



రబీ లో శనగ ముఖ్యమైన పప్పుధాన్యపు పంట. మన రాష్ట్రంలో దాదాపుగా 4-4.5 లక్షల హెక్టార్లలో సాగులో వుంది. శనగ పంటను వివిధ రకాల తెగుళ్లు ఆశించి పంట దిగుబడిని తగ్గిస్తాయి. నేల ద్వారా సంక్రమించే తెగుళ్లు (మొదలు కుళ్ళు, వేరు కుళ్ళు మరియు ఎండు తెగుళ్లు), గాలి ద్వారా సంక్రమించే మరియు వ్యాపించే తెగుళ్ళు అతి ముఖ్యమైనవి. గత రెండు సంవత్సరాలుగా శనగ పంటలో గాలి ద్వారా ఆకులను ఆశించు తెగుళ్ళ ఉధృతి గమనించడం జరిగింది. అనంతపురం, ప్రకాశం మరియు కడప జిల్లాలో కొన్ని ప్రాంతాలలో తెగులు ఉధృతి శనగ పంట దిగుబడి మరియు నాణ్యత మీద ప్రభావం చూపించడం గమనించాము. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా శనగ పంటను గాలి ద్వారా ఆకులను ఆశించు తెగుళ్ళ ఉధృతి పెరిగే అవకాశం వుంది కావున రైతులు సరైన సమయంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

**బూజు తెగులు :**


**ఈ తెగులును కలుగజేసే శిలీంధ్రం :** బొట్రైటీస్ సినేరియా

**అనుకూల వాతావరణ పరిస్థితులు :** పూత పిందె దశలలో ఉష్ణోగ్రత 20-25$^{0}$ సెంటిగ్రేడ్ మరియు గాలిలో తేమ అధికంగా వుంటే ఈ తెగులు ఉధృతి అధికంగా వుంటుంది. శనగ పైరు పూత దశలో వున్నప్పుడు ఈ తెగులు ఆశిస్తుంది. ఈ తెగులు విత్తనాల ద్వారా వ్యాప్తి చెందుతుంది.





బూజు తెగులు



కాయలపై బూజు తెగులు

**తెగులు లక్షణాలు :** తెగులు ఆశించిన మొక్కలలో కాయలు ఏర్పడవు. మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోతాయి. గాలిలో తేమ అధికంగా వున్నప్పుడు కాండము, కొమ్మలు, ఆకులు, పూలు, కాయలపై ముదురు గోధుమ మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలపై బూజు పెరుగుదల గమనించవచ్చు. తెగులు సోకిన లేత కొమ్మలు కుళ్లి విరిగిపోతాయి. తెగులు ఆశించిన ఆకులు, పూలు కుళ్లి ముద్దలుగా మారతాయి. కాయలపై నిర్దిష్టమైన ఆకారంలోని నీటి మచ్చలు ఏర్పడతాయి.


**తెగులు నివారణ :** నీటి పారుదల సౌకర్యం గల ప్రాంతాలలో ఆలస్యంగా విత్తడం, తక్కువ విత్తన మోతాదు మరియు మొక్కల

వరుసల మధ్య సిఫారసు మేరకు దూరం పాటించడం ద్వారా శనగ పైరుని బూజు తెగులు ఉధృతి నుంచి తప్పించవచ్చు. ఈ తెగులు నివారణకి థయోబెండజోల్ 200 గ్రా. లేదా బేలటాన్ 200 గ్రా. చొప్పున ఎకరానికి పిచికారి చేసుకోవాలి.

**ఆకుమాడు తెగులు :**

**ఈ తెగులును కలుగజేసే శిలీంద్రం :** కోలిటో్ట్రైకామ్ డిమాటియం.

**అనుకూల వాతావరణ పరిస్థితులు :** ఈ తెగులు ముందస్తుగా



ఆకుమాడు తెగులు



ఆకుమాడు తెగులు ఆశించిన కాయలు

విత్తిన పొలాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అకాల వర్షాలు కురిసినప్పుడు ఈ వ్యాధి సోకే అవకాశం వుంది. ఈ తెగులు పంట కాలంలో ఎప్పుడైనా ఆశించవచ్చు. ఈ తెగులు విత్తనం మరియు నెల ద్వారా వ్యాప్తి చెందును.

**తెగులు లక్షణాలు :** ఈ తెగులు ఆశించిన పొలంలో అక్కడక్కడ పూర్తిగా ఎండిపోయిన మొక్కలు మరియు పాక్షికంగా ఎండిపోయిన కొమ్మలు కనిపించును. కొమ్మలపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడును. తెగులు సోకిన కొమ్మలు కోన భాగం నుండి క్రింది వరకు ఎండిపోవును. ఆకులు మరియు కాయాలపై ఈ వ్యాధి ఆశించినప్పుడు ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి కొన భాగం నుండి క్రింది వరకు ఎండిపోవును.

**తెగులు నివారణ :** మొక్కల వరుసల మధ్య సిఫారసు మేరకు దూరం పాటించాలి. ఈ తెగులు నివారణకి హెక్సాకొనజోల్ 400 మి.లీ. లేదా ప్రోపికొనజోల్ 200 మి.లీ. లేదా క్లోరోథలోనిల్ 400 గ్రా. చొప్పున ఎకరానికి పిచికారి చేసుకోవాలి.

**తుప్పు తెగులు :**

**ఈ తెగులును కలుగజేసే శిలీంద్రం :** యూరోమైసిస్ సైసేరి అరైటిని.

**అనుకూల వాతావరణ పరిస్థితులు :** చల్లని, తడి వాతావరణం ఈ తెగులు వ్యాప్తికి అనుకూలం. శనగ పైరు పక్వనికి వచ్చే దశలో ఈ తెగులు ఆశిస్తుంది. పంటను ఆలస్యంగా విత్తుకున్నప్పుడు ఈ తెగులు ఉధృతి ఎక్కువగా వుంటుంది.



తుప్పు తెగులు

**తెగులు లక్షణాలు :** ఆకులపై గుండ్రని చిన్న గోధుమ రంగు పొక్కులు ఏర్పడతాయి. ఈ పొక్కులు ఆకుల అడుగు భాగంలో ఎక్కువగా ఏర్పడతాయి. తెగులు తీవ్రమైనప్పుడు ఈ పొక్కులు ఆకుల పై భాగం లో కూడా వ్యాపిస్తుంది మరియు మొక్కలు పక్వానికి రాకముందే ఎండిపోతాయి.

**తెగులు నివారణ :** ఈ తెగులు నివారణకి ఎకరానికి హెక్సాకొనజోల్ 400 మి.లీ. లేదా ప్రోపికోనజోల్ 200 మి.లీ. లేదా ట్రైఫ్లోక్సీ స్ట్రోబిన్ + టేబుకొనజోల్ (నేటివో) 160 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటికి కలుపుకొని వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.

ఆకులను ఆశించు తెగుళ్ళు పంట కాలంలో తెగులు సోకడానికి అనుకూలమైన వాతావరణం గమనించినప్పుడు పొలంలో అక్కడక్కడ తెగులు గమనించిన వెంటనే సస్య రక్షణ చేపట్టడం ద్వారా పంట దిగుబడి తగ్గకుండా కాపాడుకోవచ్చు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 81432 14443

# మిరప పంటలో సస్యరక్షణ చర్యలు

డా॥ టి. విజయలక్ష్మీ, సీనియర్ శాస్త్రవేత్త (తెగుళ్ళ శాస్త్రం) మరియు డా॥ సి. శారద, ప్రధాన శాస్త్రవేత్త & అధిపతి,
ఉద్యాన పరిశోధనా స్థానం, లాం, గుంటూరు.



జెమిని వైరస్ తెగులు



నీలం రంగు అట్ట

ఈ సంవత్సరం మన రాష్ట్రంలో మిరప పంటను గల ఏడాది కంటే ఎక్కువ విస్తీర్ణంలో వేయడం జరిగింది. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా ఎదబెట్టిన పొలాలు నష్టపోవడం మరియు మిరప నాట్లు ఆలస్యంగా వేయడం జరిగింది. ప్రస్తుతం పంట పూత మరియు కాయ ఏర్పడే దశలో ఉంది. మిరప పంటలో ప్రధానంగా మిరప ఆకుముడత వైరస్ (జెమిని వైరస్ / బొబ్బర తెగులు), ఎండు తెగులు, నల్ల తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంది.

### జెమిని వైరస్‌కు తీసుకొనవలసిన నివారణ చర్యలు :

- కొన్ని చోట్ల జెమిని వైరస్ లేదా బొబ్బర తెగులు ఆశించడం వల్ల 100 శాతం పంట నష్టపోవడం కూడా జరిగింది.
- ఇది తెల్ల దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. కాబట్టి తెల్లదోమకు సంబంధించిన సస్యరక్షణ చర్యలు చేపట్టి వైరస్ వ్యాప్తిని అరికట్టాలి.
- పొలంలో ఎక్కడైనా వైరస్ సోకిన మొక్కలు గమనించినట్లయితే పీకి నాశనం చేయాలి.
- గ్రీజు లేదా ఆముదం పూసిన పసుపు మరియు నీలి రంగు అట్టలు ఎకరానికి 20 చొప్పున రైతులందరూ పెట్టుకోవాలి.



పసుపు రంగు అట్ట

- కాలువ మరియు పొలం గట్లమీద కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.
- వేప సంబంధిత మందులైన వేపనూనె 10000 పి.పి.యం. లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున గాని 5 శాతం వేపగింజల కషాయం గాని పిచికారి చేయాలి.
- వైరస్ ఉధృతికి, సూక్ష్మ పోషక లోపాలకు అవినాభావ సంబంధం ఉంది గనుక పంటకు పోషక లోపాలు రాకుండా ఎరువులను సమతుల్యంగా వాడుకోవాలి. సూక్ష్మపోషక లోప లక్షణాలు గమనించినట్లయితే సూక్ష్మపోషక మిశ్రమాన్ని లీటరు నీటికి 2.5 గ్రా. చొప్పున కలిపి పిచికారి చేయాలి.

- బయో మందులు పిచికారి చేయరాదు.
- తెల్లదోమ నివారణకు ఎసిటామిప్రిడ్ 0.3 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లేదా డైఫెన్థ్యురాన్ 1.25 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి మందులను మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి.

**ఎండు తెగులుకు నివారణ చర్యలు :**

- భూమిలో ఎక్కువ రోజులు అధిక తేమ ఉండుట వలన గాలి చొరబడక క్రొత్త వేర్లు పూయక పోవడం, ఉన్న వేర్లు ఎదుగుదల లేక కుళ్ళి పోవడం జరుగుతుంది. అదే అదునుగా భూమిలో ఉండే శిలీంధ్రము లేదా బాక్టీరియా ఆశించడం వల్ల ఎండు తెగులు ఉధృతి ఎక్కువవడం జరుగుతుంది.



ఎండు తెగులు

- ఎండు తెగులు వ్యాప్తిని అరికట్టడానికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 గ్రా. కార్బండెజిమ్ ఒక లీటరు నీటికి చొప్పున కలిపిన ద్రావణాన్ని పాదులలో పోయాలి.
- ఎకరానికి 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి అనే జీవ శిలీంధ్ర నాశినిని పశువుల ఎరువులో వృద్ధిపరచి పొలంలో తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలి.

**నల్ల తామర పురుగు / పూతను ఆశించే తామర పురుగు నివారణకు తీసుకొనవలసిన చర్యలు :**

- గత ఏడాది జనవరి, 2021 లో ఈ పురుగు మిరప పంటను ఆశించి, ఉధృతి పెరగడం వల్ల రైతులు నష్టపోవడం జరిగింది. ఈ సంవత్సరం కూడా నల్ల తామర పురుగులు లేదా పూతను ఆశించే తామర పురుగులు ఉధృతి ఎక్కువగా ఉన్నందున రైతులు ఆందోళనలో ఉన్నారు. రైతులు దీనిని ఎర్ర నల్లి అని అపోహపడి నల్లికి సంబంధించిన మందులను పిచికారి చేయడం జరుగుతుంది. ఈ తామర పురుగులు ఆకులతో పాటు పూతను కూడ ఆశించి పంటను నష్ట పరుస్తుంది.



నల్ల తామర పురుగు / పూతను ఆశించే తామర పురుగు

- దీని నివారణకు ఎకరానికి ఎసిటామిప్రిడ్ (ప్రైడ్) 40-50 గ్రా. లేదా సయాంట్రినిలిప్రోల్ (బెనీవియా) 240 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 80 డబ్ల్యూ.జి. (జంప్) 40-50 గ్రా. లేదా 40% ఇమిడాక్లోప్రిడ్ + ఫిప్రోనిల్ 40% డబ్ల్యూ.జి. (పోలీస్) 40-50 గ్రా. లేదా స్పైరోటెట్రామెట్ 150 ఒ.డి. (మువెంటో) 160 మి.లీ. మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఈ మందులతో పాటు తప్పనిసరిగా ఎకరానికి 200 మి.లీ. వేపనూనె 10000 పి.పి.యం. ను కలిపి పిచికారి చేయాలి. వీటితో పాటుగా 0.5 గ్రా. సర్ఫ్ లేదా ట్రైటాన్×100 ను కలిపి పిచికారి చేయాలి.
- ప్రస్తుత వాతావరణంలో కొమ్మ కుళ్ళు లేదా కానోఫోరా ఎండు తెగులు కూడా ఆశించడానికి అవకాశముంది. దీని నివారణకు 10 లీటర్ల నీటిలో 30 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ మరియు 1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ కలిపి పిచికారి చేయాలి.
- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలలో నీరు నిలబడి మిరప పంట ముంపునకు గురైతే అధిక తేమ వలన వేర్లు ద్వారా మొక్క అవసరమైన పోషకాలు తీసుకోలేక మొక్కలు ఉరకెత్తి తలలు వాల్చుతాయి. ఈ పొలాల్లో లీటరు నీటికి 10 గ్రా. యూరియా మరియు 5 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్‌ను వారం రోజులు వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.
- ఇనుప ధాతు లోపం గమనించినట్లయితే 10 లీటర్ల నీటికి 50 గ్రా. అన్నబేధితో పాటు ఒక నిమ్మ చెక్క రసం కలిపి పిచికారి చేయాలి.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 94906 66286

# మామిడి పంటలో పూత మరియు కాయ దశలలో తీసుకోవల్సిన సస్యరక్షణ చర్యలు

డా॥ వి. హరికుమార్, శాస్త్రవేత్త (ఉద్యాన శాస్త్రం); డా॥ ఎస్. రమేష్ కుమార్, సహ పరిశోధకులు (కీటక శాస్త్రం); డా॥ ఎస్. స్రవంతి, శాస్త్రవేత్త (వాతావరణ శాస్త్రం) మరియు డా॥ ఎ. ప్రసన్నరాణి, సహ పరిశోధకులు (విస్తరణ శాస్త్రం), కృషి విజ్ఞాన కేంద్రం, రస్తాకుంటుబాయి.



పండ్ల తోటలలో మామిడి ప్రధానమైనది. ఫల రాజుగా కీర్తింపబడుతున్న మామిడి మన రాష్ట్రంలో కృష్ణా, చిత్తూరు, విజయనగరం జిల్లాలతో పాటు మిగిలిన జిల్లాలలో కూడా పండిస్తున్నారు. సాధారణంగా మామిడిలో పూత డిసెంబర్, జనవరి నెలల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ముదురు కొమ్మలపై పూత, కాత రావటం మామిడి యొక్క ప్రత్యేకత.

ప్రస్తుత వాతావరణ మార్పుల వల్ల సగటు ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తున్నాయి. అంతేకాకుండా అకాల వర్షాలు వంటి పరిస్థితుల వలన పూత ఆలస్యంగా రావటం లేదా పూత తక్కువగా రావటం మరియు వచ్చిన పూత, పిందె దశలో రాలిపోవటం, వంటివి జరుగుతున్నాయి. మారిన వాతావరణ పరిస్థితుల వల్ల పూత, కాయలను చీడపీడలు ఆశిస్తున్నాయి. మామిడి లేత ఆకుల పరిమళం, పూత యొక్క సువాసన కారణంగా చాలా పురుగులు మామిడిని ఆశిస్తున్నాయి. కావున సరియైన సమయాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు పొందే అవకాశం ఉన్నది.

**సస్యరక్షణ :**

**పురుగులు :**

**తేనె మంచు పురుగులు :** వీటిని మాంగో హాపర్స్ అని అంటారు. మామిడి పూత దశలో ఆశించి పురుగుల్లో తేనె మంచు పురుగులను ప్రత్యేకంగా చెప్పవచ్చు. వీటి వల్ల నష్టం ఎక్కువగా నవంబర్ నెల నుండి మార్చి నెలాఖరు వరకు ఉంటుంది. ఈ పురుగు ఆశించినప్పుడు పూత పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోతుంది.



తేనె మంచు పురుగు



ఆకులపై తేనెలాంటి తియ్యని పదార్థం




కాయలపై నల్లని మసి రంగు

తల్లి పురుగులు, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పుష్పగుచ్ఛాలు, పూలు మరియు పిందెల నుండి రసాన్ని పీలుస్తాయి. దీని వల్ల పూత మాడిపోయి రాలిపోతుంది. ఈ పురుగులు విసర్జించిన తేనెలాంటి తియ్యని పదార్థంపై శిలీంద్రాలు పెరిగి ఆకులు మరియు కాయలపై నల్లని మసిమంగు ఏర్పడుతుంది. ఈ పురుగులు పూత మరియు కోత దశలో ఆశించి నష్ట పరుస్తాయి. మిగతా సమయాల్లో కాండం మరియు బెరడు చీలికల్లో దాక్కొని ఉంటాయి. పూత మొదలయ్యే సమయంలో మోనోక్రోటోఫాస్ 1.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ.లను లీటరు నీటిలో కలుపుకొని చెట్లపై మొదలు నుండి చివరి వరకు అన్ని కొమ్మలు తడిచేటట్లు పిచికారి చేయాలి.

పూ మొగ్గ దశలో థయోమిథాక్సామ్ 0.3 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పిందె దశలో ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఫాస్ఫామిడాన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు :** మామిడి పూత మరియు కాయల నుంచి రసాన్ని పీల్చి నష్టం కలుగజేసే పురుగుల్లో ఇవి ఒకటి. ఇవి 2 మి.మీ. పొడ ఉండి, కొత్త చిగురు వచ్చే దశలో ఆకులపై అసంఖ్యాకంగా చేరి గోకి రసాన్ని పీల్చి వేస్తాయి. ఈ పురుగులు పుష్ప గుచ్చాలపై పిందెలపై చర్మాన్ని గోకి రసం పీల్చడం వల్ల



తామర పురుగు ఆశించిన కాయ

వక్క రంగులో గరుగు మచ్చలు ఏర్పడతాయి. దీన్నే రాతి మంగు అంటారు. దీని వల్ల కాయ నాణ్యత తగ్గి సరియైన మార్కెట్ ధర పలకదు. దీని నివారణకు పిందె దశలో 2 మి.లీ. ఫిప్రోనిల్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**ఆకు జల్లెడ గూడు పురుగు :** ఈ పురుగులు ఆకులు మరియు పూతను ఆశించి తీవ్రంగా నష్టపరుస్తాయి. ఈ పురుగు లార్వాలు ఆకుల మధ్యనున్న కణజాలాన్ని తినేసి జల్లెడలాగా చేసి గూడు ఏర్పరచుకుంటాయి. దీని వల్ల పూత ఏర్పడదు. పూత దశలో పూగుత్తులను కూడా గూడుగా ఏర్పరచుకోవడం వల్ల పూత



ఆకు గూడు పురుగు

రాలిపోయి, పిందెలు ఏర్పడవు. దీని నివారణకు ఈ పురుగు గుళ్ళను ఇనుపకొక్కము కలిగిన పొడవాటి వెదురు కర్రతో తొలగించి నాశనం చేయాలి. ఆ తర్వాత క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పిండినల్లి :** మామిడి పిందె మరియు కాయలపై, కాడలపై తెల్లని పిండి వంటి పదార్థపు కవచం కలిగిన చిన్న పురుగులు ఆశించి పంటకు నష్టం చేకూరుస్తాయి. తల్లి పురుగులు చెట్లు పాదుల్లో మట్టిలో గుడ్లు పెడతాయి. ఈ గుడ్ల నుండి బయటకు వచ్చిన పిల్ల పురుగులు పాకటం ద్వారా లేదా చీమల ద్వారా కాయలపై మరియు కాయతొడిమల పైకి చేరతాయి. ఈ పురుగులు



పిండి నల్లి

పూత రెమ్మలు, కాయలు, తొడిమలపై గుంపులుగా చేరి రసాన్ని పీల్చి నష్టపరుస్తాయి. ఇవి విసర్జించిన తియ్యని పదార్థంపై నల్లని మసిమంగు ఏర్పడుతుంది. వీటి తీవ్రత ఫిబ్రవరి, మార్చి నెలల్లో అధికంగా ఉంటుంది. పిండినల్లి ఆశించిన రెమ్మలు, కాయలపై ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా ఫాస్ఫామిడాన్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లను లీటరు నీటిలో కలుపుకొని పిచికారి చేయాలి. చెట్టుకి మీటరు ఎత్తులో పాలిథీన్ షీట్స్ కట్టడం, దానిపై గ్రీజు పూయడం ద్వారా పురుగులు చెట్టు పైకి పాకకుండా నివారించవచ్చు.

**కాయ తొలుచు పురుగు :** దీని ఉధృతి చిన్న కాయదశ నుండి పెద్ద కాయదశ వరకు ఉంటుంది. కాయ ముక్కు భాగంలో నల్లటి రంధ్రముతో ఎండిన మామిడి కాయ / పిందెల గుత్తులు చెట్టుకు వ్రేలాడుట ప్రధానమైన లక్షణము. గోళీ సైజు కాయదశలో ఒక్కొక్క గొంగళి పురుగు, ఒకటి కన్నా ఎక్కువ కాయలకు నష్టము కలుగ చేయును. సాధారణముగా ఒక్కొక్క మామిడి కాయనందు 4-6 గొంగళి పురుగులు ఉండును. చిన్న సైజు కాయలున్నప్పుడు



కాయ తొలుచు పురుగు



పక్షి కన్ను తెగులు

పురుగులు ఒక కాయ నుండి మరొక కాయకు మారి ఎక్కువ నష్టం కలిగించును. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో తల్లి రెక్కల పురుగులు బయటకు వచ్చి పంటపై ఆశిస్తాయి. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. మరియు డైక్లోరోవాస్ 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

**తెగుళ్ళు :**

**బూడిద తెగులు :** ఈ తెగులు సోకినప్పుడు పై రెమ్మలు, పూత మరియు పిందెల మీద బూడిద లాంటి తెల్లని పదార్ధం ఏర్పడుతుంది. ఈ శిలీంధ్రం పూత మరియు పిందె నుండి పోషకాలను పీల్చి వేయడం వల్ల రాలిపోతాయి. రాత్రి పూట చలి ఎక్కువగా ఉండి పగటిపూట ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు ఆశిస్తుంది. వీటి నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా డైనోకాప్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి 15-20 రోజుల వ్యవధిలో మందులు మార్చి మార్చి పిచికారి చేయాలి.



బూడిద తెగులు

**పక్షి కన్ను తెగులు / మచ్చ తెగులు :** ఇది ఆకులు, కొమ్మలు, పూరెమ్మలు, పూలు, పండ్లపైన ఆశిస్తుంది. ఆకులపై మచ్చలు గోధుమ రంగులో మధ్యస్తంగా ఉండి గులాబి రంగులో ఉంటాయి. ఈ మచ్చలు తరువాత ఎండిపోయి ఆకులు రాలిపోతాయి. పూరెమ్మలపై పొడుగాటి నల్లటి మచ్చలు ఏర్పడతాయి. పిందెలపై కూడా నల్ల మచ్చలు ఏర్పడటం వలన పిందెలు రాలిపోతాయి.

దీని నివారణకు పచ్చిపూత దశలో కార్బండెజిమ్ 1 గ్రా. లేదా థయోఫినేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పిందె దశలో మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**మసి తెగులు (సూటీమోల్డ్) :** ఈ తెగులు తేనె మంచు పురుగు, పిండినల్లి లాంటి రసం పీల్చే పురుగు విసర్జించే తేనెలాంటి జిగురు పదార్ధం మీద వృద్ధి చెందుతుంది. ఈ తెగులు వలన నల్లని మసిలాంటి పొర ఆకులపై, కొమ్మలపై ఏర్పడుతుంది. కిరణజన్య సంయోగక్రియ జరగక కాయ ఎదుగుదల దిగుబడి క్షీణిస్తుంది. ఈ తెగులు నివారణకు ముందుగా రసం పీల్చే పురుగులను నియంత్రించాలి. తరువాత ఆకులపై మసిని తొలగించుటకు 2 కిలోల గంజి పొడిని గోరు వెచ్చని నీటిలో కలిపి ఉడికించి, తరువాత నీరు పోసి 100 లీటర్ల ద్రావణంను తయారు చేసుకోవాలి. ఈ ద్రావణంను చెట్లపై మసి తెగులు కనిపించిన చోట్ల పిచికారి చేయాలి.

**పిందె దశలో పోషక యాజమాన్యం :** మామిడి కాయలు నిమ్మకాయ సైజు నుండి భుజాలు ఏర్పడేంత వరకు చాలా త్వరగా పెరుగుతాయి. ఈ సమయంలో నీటి వసతి గల తోటలకి 750 గ్రా. యూరియా, 500 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను ఒక్కొ చెట్టుకి మొదళ్ళ దగ్గర 1.5 మీ. దూరంలో గాడి తీసి అందులో ఎరువులను వేసి నీరు కట్టాలి. అలాగే పిందె బఠాణి సైజు నుండి గోళీ కాయ సైజు మధ్యలో ఉన్నప్పుడు పిందె రాలడం ఎక్కువగా గమనించవచ్చు. దీన్ని తోటకు నీరు పెట్టడం వలన తగ్గించవచ్చు. ఈ దశలో ప్లానోఫిక్స్ మందును 5 లీటర్ల నీటికి 1 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేయటం ద్వారా పిందెలు రాలటాన్ని తగ్గించవచ్చు. బోరాన్ లోపం గమనించి నట్లయితే బోరాన్ 1.25 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**నీటి యాజమాన్యం :** మామిడి తోటల్లో కాయ ఎదిగే దశలో సరైన నీటి యాజమాన్యం చేపడితే కాయ పరిమాణం పెరిగి మంచి నాణ్యత వస్తుంది. నీటి వసతి లేని తోటల్లో కాయసైజు పెంచడానికి పొటాషియం నైట్రేట్ (13:0:45) ను లీటరు నీటికి 10 గ్రా. చొప్పున కలిపి కాయలు నిమ్మ కాయ సైజు ఉన్నప్పుడు పిచికారి చేయాలి.


మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 94403 46501

# ఆంధ్రప్రదేశ్ లోని వాతావరణ మండలాలు మరియు జిల్లాల వారిగా 2021 నైఋతి ఋతుపవనాల ద్వారా విచ్చేసిన వర్షపాతం తద్వారా వివిధ ఆయకట్టలోనికి విచ్చేసిన నీటి నిల్వలు మరియు పంటల సాగు విస్తరణ

డా॥ యం. రత్నం, ప్రధాన శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) మరియు డా॥ పి. రత్నప్రసాద్, పరిశోధనా సంచాలకులు,
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం.

**ఖ**రీఫ్ పంటల విస్తరణ మరియు రిజర్వాయర్లలోని నీటి నిల్వలకు ప్రధానమైన నైరుతి ఋతుపవనాలు మన రాష్ట్రంలో సాధారణ ఆగమనము జూన్ నాల్గవ తేది కాగా ఈ సంవత్సరం అదే రోజుకి రాయలసీమ మీదుగా విచ్చేసి జూన్ 10 వ తేదికి రాష్ట్రమంతా వ్యాపించాయి. ఫలితంగా ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా మరియు రాయలసీమ జిల్లాలలో సాధారణ వర్షపాతం నెలకొల్పబడి మొత్తంగా ఆంధ్ర రాష్ట్రం అంతా ఈ ఖరీఫ్ పంట కాలానికి సాధారణ వాతావరణం నెలకొల్పబడి తాగు మరియు సాగుకు సరిపడా నీటి వనరులు లభ్యతలో వరుణ దేవుడి కరుణ మెండుగా ఉన్నదనుటకు ఈ దిగువ 1 మరియు 2 పట్టికలు ప్రస్ఫుటంగా తెలియచేయుచున్నవి. కోస్తా జిల్లాలైన ప్రకాశం (-17%) మరియు నెల్లూరు (-23%) అలానే రాయలసీమ జిల్లా అయిన కర్నూలు (-13%) జిల్లాలలో కొంతమేర సగటుకన్న దిగువున నమోదైనప్పటికి మొత్తంగా రాష్ట్రమంత సాధారణ వర్షపాత (9%) స్థితి నెలకొల్పుటలో ఈ 2021 నైరుతి ఋతుపవనాల పాత్ర ప్రసంసనియము.


**పటం 1 : వాతావరణ మండలాలు మరియు జిల్లాల వారిగా 2021 నైరుతి ఋతుపవనాల ద్వారా విచ్చేసిన వర్షపాతం (మి.మీ.)**





ఆంధ్ర రాష్ట్రంలో ఈ సంవత్సరం ఖరీఫ్ 2021 నాటి నైరుతి ఋతుపవనం ద్వారా వివిధ ఆయకట్టలలో విచ్చేసిన నీటి నిల్వలు గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆశించిన మేర విచ్చేసి తాగు మరియు సాగు అవసరాలకు దోహదపడ్డాయి అనుటలో సందేహం లేదు. ఈ ఖరీఫ్‌లో కూడా గత సంవత్సరంలానే నీటి నిల్వలు చేరి మంచి ఫలితాలు విచ్చేసాయి, ఈ ఖరీఫ్ చివరి నాటికి ఆయకట్ట వారిగా గోదావరి బేసిన్ లో 1.17, కృష్ణా బేసిన్ లో 124.34 మరియు పెన్నా ఆయకట్టులో 33.31 టి.ఎం.సి. లుగా వరద ప్రవహము నమోదుకాబడినది (పటం 3.)


ఈ ఖరీఫ్ 2021 పంట కాలానికి రాష్ట్ర సాగు విస్తరణ 38,13,859 హెక్టార్లు లక్ష్యం కాగా సాధారణ సాగు విస్తరణ 37,33,301 హెక్టార్లుకు గాను ఈ ఏడాది 35,93,974 హెక్టార్ల లో వివిధ పంటల సాగు చేపట్టబడి మొత్తంగా 96% విస్తీర్ణంలో వివిధ రకాల పంటల సాగు చేపట్టబడినవి. ఒక్కొ పంట వారిగా విస్తరణ శాతాలను గమనించినట్లైతే, ధాన్యాలు 97%, అపరాలు 84%, నూనెగింజలు 92% విస్తరణలో సాగు చేపట్టి మొత్తంగా వందకి వంద శాతంలో ఆహార ధాన్యాలు సాగు చేపట్టబడి వరి 104%, జొన్న 124%, సన్ ఫ్లవర్ 241% సాగు చేపట్టబడినవి (పటం. 4).

పటం 2 : వాతావరణ మండలాలు మరియు జిల్లాల వారిగా 2021 నైరుతి ఋతుపవన వర్షపాత విస్తరణలో వ్యత్యాసాలు (శాతాలలో)




పటం 3 : ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ఆయకట్టులలో ఖరీఫ్ 2021 నాటి నీటి నిల్వలు మరియు వరద నిరు చేరిక (టి.ఎం.సి.లలో)




పటం 4 : ఆంధ్రప్రదేశ్ లో ఖరీఫ్ 2021 నాటి పంటల సాగు విస్తరణ (శాతాలలో)

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : 77026 06857

# తెల్లవన్ని పాలు కావు : పాల కల్తీ - నిర్ధారణ

డా॥ జె. తేజ, శాస్త్రవేత్త (పశు విజ్ఞాన శాస్త్రం) మరియు డా॥ ఎ. వీరయ్య, కార్యక్రమ సమన్వయ కర్త,
కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు, కడప.

**పా**లు సమతుల్య ఆహారంలో అత్యంత ముఖ్యమైన భాగం. పాలు ప్రతీ ఒక్కరికి అవసరమైన పోషక పదార్థాలు కలిగి ఉంటుంది. ముఖ్యంగా మాంసకృత్తులు, కాల్షియం, పొటాషియం వంటి ఖనిజాలు, విటమిన్ డి, బి కాంప్లెక్స్ వంటి విటమిన్లు పాలలో లభిస్తాయి. పాలు శిశువుల మరియు చిన్నపిల్లల ఎదుగుదలకు, మహిళలకు కాల్షియం లోపం వల్ల కలిగే ఎముకల సంభంధిత సమస్యల నివారణకు, వృద్ధులలో త్వరగా జీర్ణమై శక్తిని అందించేందుకు తోడ్పడుతుంది. కాబట్టి పాలను అన్ని వయస్సుల వారు తమ ఆహారంలో భాగంగా విరివిగా వినియోగిస్తున్నారు. పాల వినియోగం ఎక్కువగా ఉండడంవల్ల పాల యొక్క కొరత ఏర్పడుతుంది. ఈ కొరతను తగ్గించుటకొరకు పాలను కల్తీ చేసే అవకాశం ఉంది. కాబట్టి పాల నాణ్యత విషయంలో ప్రజారోగ్య శాఖ వారు కొన్ని నిర్దిష్ట ప్రమాణాలను ప్రజారోగ్య చట్టంలో పొందుపరిచారు. ఈ చట్టం ప్రకారం గేదె పాలలో 5 శాతం వెన్న, 9 శాతం కొవ్వు కాని ఘన పదార్థాలు (యస్.యాన్. యఫ్), ఆవు పాలలో కనీసం 3.5 శాతం వెన్న, 8.5 శాతం యస్.యన్.యఫ్. ఉండాలి. ఈ ప్రమాణాలు కంటే తక్కువగా ఉంటే అవి నాణ్యత లేని పాలుగా గుర్తిస్తారు. కాబట్టి పాలను కల్తీ చేసే పదార్థాలు, వాటి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు మరియు పాల కల్తీని కనుగొనుటకు పరీక్షలను తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**పాలల్లో కల్తీ :** పాల యొక్క పరిమాణాన్ని గాని, నిల్వ సామర్థ్యాన్ని పెంచుటకు పాలలో కొన్ని పదార్థాలను ఉద్దేశపూర్వకంగా కలిపితే పాలను కల్తీ చేసినట్టు. కల్తీ చేసిన పాలను వినియోగించడం వల్ల ప్రజలకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కలుగవచ్చు. కాబట్టి పాల యొక్క నాణ్యతను పరీక్షించడం చాలా ఆవశ్యకం.

### పాలను కల్తీ చేయుటకు ముఖ్య కారణాలు :

1. పాలు నిల్వ ఉండే సమయం చాలా తక్కువగా ఉండడం వల్ల.
2. వేసవి కాలంలో పాల కొరత ఏర్పడినప్పుడు. (3) పాల నాణ్యత కంటే అధిక లాభాలకు వ్యాపారస్తులు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడం. (4) పాల యొక్క నాణ్యతపై వినియోగదారులకు అవగాహన లేకపోవడం. (5) పాల నాణ్యతపై పర్యవేక్షణ తక్కువగా ఉండడం. (6) పాల నాణ్యతను పరీక్షించే కేంద్రాలు తగినన్ని లేకపోవడం.



**పాలను కల్తీ చేయు పదార్థాలు మరియు వాటివల్ల కలిగే ఆరోగ్య సమస్యలు :** పరిస్థితి, ఆవశ్యకత, అవకాశమును బట్టి వివిధ పదార్థాలతో పాలను కల్తీ చేస్తారు. వీటిలో ముఖ్యమైనవి నీరు, ఉప్పు, గోధుమ / మైదా పిండి, వంట సోడా, ఫార్మాలిన్, యూరియా, వంట నూనె. ఇవి పాల యొక్క పరిమాణాన్ని పెంచుటకు లేక పాల యొక్క నిల్వ సామర్థ్యం పెంచుటకు దోహదపడుతాయి. కాని ఇటీవల కాలంలో కృత్రిమంగా పాలను తయారు చేసి కూడా విక్రయిస్తున్నారు. ఈ కృత్రిమ పాలను యూరియా, వంట నూనె, డిటర్జెంటు, కాస్టిక్ సోడా, చక్కర, ఉప్పు మరియు పాల పొడిలను కలిపి తయారు చేస్తున్నారు. ఇలా కల్తీ చేసిన పాలను తీసుకోవడంవల్ల, వినియోగదారులు తీవ్రమైన ఆరోగ్యసమస్యలకు గురి అవుతున్నారు. ముఖ్యంగా మూత్రపిండాలు, గుండె, జీర్ణ కోశం, కళ్ళు, చర్మం వంటి అవయవాల పనితీరుపై వీటి ప్రభావం ఎక్కువ. దీర్ఘకాలం కల్తీ పాలను వినియోగించినట్లయితే క్యాన్సర్ కు కూడా కారణం కావచ్చు.

**పాలలో కల్తీ పదార్థాల నిర్ధారణ :** పాలను తరచుగా కల్తీ చేసే పదార్థాలను, క్రింద వివరించిన పరీక్షలను చేసినట్లయితే నిర్ధారణ చేయవచ్చు.

**1. నీరు :** ఒక చుక్క పాలను నున్నని స్థలంలో పోసి జారించినప్పుడు, పాల చుక్క త్వరగా జారితే పాలను నీటితో కల్తీ చేసినట్టు. పాలు మెల్లగా జారుతూ తెల్లని మచ్చను విడిచితే పాలు స్వచ్ఛమైనవి.

**2. పిండి పదార్థాలు :** పాలను మరిగించి, చల్లార్చిన తరువాత, కొన్ని చుక్కల 1 శాతం అయోడిన్ ద్రావణాన్ని కలిపినప్పుడు పాలు నీలి రంగులోనికి మారినట్లయితే పాలలో పిండి పదార్థాలతో కల్తీ చేసినట్టు నిర్ధారించవచ్చు.

| క్ర. సం. | పాలను కల్తీ చేయుటకు ఉపయోగించే పదార్థాలు | కల్తీ చేయుటకు ఉద్దేశ్యం | కల్తీ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు |
|---|---|---|---|
| 1. | యూరియా | పాలు తెల్లగా కనిపించుటకు, పాల గాఢత పెంచుటకు పాలలోని యస్. యన్.యఫ్. శాతం పెంచుటకు, కృత్రిమంగా తయారు చేయు పాలలో యూరియాను కలుపుతారు. | మూత్రపిండాలపై ప్రభావం చూపుతుంది. చేతుల మరియు కాళ్ళ వాపులు, చూపు బలహీనపడడం. |
| 2. | పిండి పదార్థాలు (గోధుమ పిండి / మైదా), చక్కర | పాల గాఢత / చిక్కధనం పెంచుటకు | విరేచనాలు, మధుమేహం మరియు రక్త పోటు వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య సమస్యలు |
| 3. | డిటర్జెంటు | పాలు తెల్లగా కనిపించుటకు, పాలలో నూనె కరిగించుటకు | చర్మం, జీర్ణకోశ మరియు శ్వాసకోశ వ్యాధులు |
| 4. | న్యూట్రలైజర్స్ | పాల నిల్వ ఉన్నప్పుడు పాలలో పెరిగే ఆమ్లత్వాన్ని తగ్గించుటకు | హార్మోన్ల అసమతుల్యత, పునరుత్పత్తి సమస్యలు |
| 5. | ఫార్మాలిన్ | పాల నిల్వ సామర్ధ్యం పెంచుటకు | వాంతులు, విరేచనాలు, శ్వాసకోశ ఇబ్బందులు, దృష్టి లోపం, గుండె సంభంధిత వ్యాధులు, క్యాన్సర్ |
| 6. | నీరు | పాల యొక్క పరిమాణాన్ని పెంచుటకు | పాలలోని పోషక విలువ తగ్గుట, వాంతులు, విరేచనాలు. |

**3. డిటర్జెంట్ :** పాలను బాగా తిరగ కలిపినప్పుడు, నురుగు ఏర్పడితే, పాలలో డిటర్జెంట్ తో కల్తీ చేసిన్నట్టు.

**4. చక్కర :** పాలలో కొద్దిగా హైడ్రోక్లోరిక్ ఆమ్లమును కలిపి కొద్దిగా రిసార్సినాల్ ముక్కలను వేసి, వేడి నీటి పాత్రలో 10 నుండి 15 నిమిషాలు ఉంచితే ఎరుపు రంగులోకి మారితే పాలలో చక్కరతో కల్తీ చేసినట్టు. మధుమేహాన్ని కనుగొనుటకు ఉపయోగించే డయాస్టిక్ ను పాలల్లో ముంచి తీసినప్పుడు 30 సెకండ్లలో రంగు మారినట్లయితే పాలలో చక్కర కలిపినట్టు.

**5. న్యూట్రలైజర్స్ :** పాలలో సోడియం హైడ్రాక్సైడ్, బట్టల సోడా (సోడియం కార్బోనేట్), వంట సోడా (సోడియం బైకార్బోనేట్) వంటి న్యూట్రలైజర్స్ కలపి పాలు చెడిపోకుండా కల్తీ చేస్తున్నారు. సోడా పరీక్ష ద్వారా న్యూట్రలైజర్స్ ను కనుక్కోవచ్చు.

**సోడా పరీక్ష :** 5 మి.లీ. పాలలో, 5 మి.లీ. ఆల్కహాలు కలిపి, రెండు లేక మూడు చుక్కల 1% రోసాలిక్ ఆమ్లము కలిపితే, పాలు గులాబి రంగులో మారితే, పాలలో సోడా కలిపినట్టు. అలాంటి పాలను తిరస్కరించాలి.

**6. ఫార్మాలిన్ :** ఒక టెస్ట్ ట్యూబులో 10 మి.లీ. ల పాలను తీసుకొని, 5 మి.లీ. సల్ఫ్యూరిక్ ఆమ్లమును టెస్ట్ ట్యూబు లోన అంచల మీదుగా నెమ్మదిగా కదపకుండా కలపాలి. ఆమ్లము మరియు పాలు కలిసిన దగ్గర నీలి రంగు రింగు ఏర్పడుతుంది. అలాంటి పాలను తిరస్కరించాలి.

**7. యూరియా :** పాలలోని యస్.యన్.యఫ్. శాతం పెంచుటకు కృత్రిమంగా తయారు చేయు పాలలో యూరియాను కలుపుతారు. 5 మి.లీ. ల పాలలో, 0.2 మి.లీ. ల యూరియెజ్ కలిపి, ఆ తరువాత 0.1 మి.లీ.ల బ్రోమోథైమోల్ బ్లూ కలపాలి. పాలు నీలి రంగులోనికి మారితే పాలు యూరియా తో కల్తీ చేయబడినట్టు. చెంచాడు పాలల్లో, అర చెంచాడు సోయాచిక్కుడు పొడి కలిపి, 5 నిమిషాల తరువాత ఎర్ర లిట్మస్ కాగితంను ముంచితే నీలి రంగులోకి మారితే యూరియా ఉన్నట్లు.

**పాల కల్తీ నిర్ధారణ కిట్ :** పాలలో కల్తీ నిర్ధారణ చేయుటకు జాతీయ పాడి అభివృద్ధి బోర్డ్ (నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్), ఆనంద్, గుజరాత్ వారు కిట్లు తయారు చేసారు. ఈ కిట్లను ఉపయోగించి పాలలో ఉన్న కల్తీ పదార్థాలను సులువుగా కనుక్కోవచ్చు. ముఖ్యంగా ఉప్పు, యూరియా, చక్కర, న్యూట్రలైజర్స్, పిండి పదార్థాలను కనుక్కోవచ్చు.

పైన వివరించిన విధంగా పాలలో కల్తీని నిర్ధారణ చేసినట్లైతే, పాల కల్తీని సులువుగా గుర్తించి, కొంత వరకు పాల కల్తీని నియంత్రించవచ్చు. కావున వినియోగదారులకు ఈ సులభమైన నిర్ధారణ పరీక్షలపై అవగాహన కలిగి ఉండి, పాలలోని కల్తీని గుర్తించి, స్వచ్ఛమైన పాలను పొందవచ్చు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 81435 17337

## వ్యవసాయ విద్యా దినోత్సం

విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మన దేశ తొలి రాష్ట్రపతి, భారతరత్న డా॥ బాబు రాజేంద్ర ప్రసాద్ గుర్తుగా డిసెంబరు 3, 2021 న జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవంగా జరుపుకోవడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ఎ. విష్ణువర్ధన రెడ్డి గారు పాఠశాల విద్యార్థులలో వ్యవసాయం పట్ల ఇష్టాన్ని ఏర్పరిచేటట్లు వారిలో ఆసక్తిని, ప్రేరణను కలిగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్షేత్ర సందర్శనలను, ప్రదర్శనలు ఏర్పాటు చేసి శాస్త్రవేత్తలతో చర్చా కార్యక్రమం ద్వారా వివిధ పంటలపై అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన కిసాన్ మేళాలు

**చింతపల్లి :** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, చింతపల్లి నందు 22.11.2021 న కిసాన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విస్తరణా సంచాలకులు డా॥ రాంబాబు, పరిశోధనా సంచాలకులు డా॥ ఎన్. త్రిమూర్తులు మరియు గౌరవ అతిథులుగా పాలక మండలి సభ్యులు శ్రీ పి. దేవుళ్ళు పాల్గొన్నారు. ఈ సందర్భముగా వ్యవసాయ ప్రదర్శనశాలను రైతులు తిలకించారు. రైతులకు క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించి బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎ.ఆర్.ఎస్., చింతపల్లి, ఎ.డి.ఆర్., డా॥ రామారావు; ఆర్.ఎ.ఆర్.ఎస్., అనకాపల్లి, ఎ.డి.ఆర్., డా॥ యం. భరతలక్ష్మీ; వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

**విజయనగరం :** నవంబరు 23, 2021 న వ్యవసాయ పరిశోధనా స్థానం, విజయనగరం నందు కిసాన్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఎ. సూర్యకుమారి, విస్తరణ సంచాలకులు డా॥ పి. రాంబాబు; పరిశోధనా సంచాలకులు డా॥ ఎన్. త్రిమూర్తులు; పాలక మండలి సభ్యులు యం. కస్తూరి, శ్రీ పి. దేవుళ్ళు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎ.ఆర్.ఎస్., అనకాపల్లి, ఎ.డి.ఆర్., డా॥ యం. భరతలక్ష్మీ; ఎ.ఆర్.ఎస్., విజయనగరం అధిపతి డా॥ కె. పాత్రో; వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులు పాల్గొన్నారు. వివిధ వ్యవసాయ సాంకేతికతలు, యంత్రాలు, విత్తనాలను ప్రదర్శనశాలలో ఉంచారు.

**అనకాపల్లి :** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, అనకాపల్లి నందు తేది 29.11.2021 న కిసాన్ మేళా నిర్వహించారు. ఈ కిసాన్ మేళాలో విస్తరణ సంచాలకులు డా॥ పి. రాంబాబు, పరిశోధనా సంచాలకులు డా॥ ఎన్. త్రిమూర్తులు; పాలక మండలి సభ్యులు యం. కస్తూరి, డా॥ ఎస్.వి.ఎస్.ఆర్.కె. నేతాజి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధునిక బెల్లం తయారీ కేంద్రంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎ.ఆర్.ఎస్., అనకాపల్లి, ఎ.డి.ఆర్., డా॥ యం. భరతలక్ష్మీ, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

**నైరా :** వ్యవసాయ కళాశాల, నైరా నందు తేది 3.12.2021 న కిసాన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి డి. కృష్ణదాస్; పశు సంవర్ధక, పాడి మరియు మత్స్య శాఖ మంత్రి సి. అప్పలరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మిషన్ సభ్యులు జి. రఘురాం; పాలక మండలి సభ్యులు డా॥ ఎస్.వి.ఎస్.ఆర్. కె. నేతాజి; వ్యవసాయ కళాశాల, నైరా, అసోసియేట్ డీన్ డా॥ యం. సురేష్ కుమార్; శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

**దర్శి :** వ్యవసాయ పరిశోధనా స్థానం, దర్శిలో తేది 9.12.2021 న కిసాన్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డా॥ పి. రాంబాబు, పరిశోధనా సంచాలకులు డా॥ ఎన్. త్రిమూర్తులు, ముఖ్య అతిథులు జిల్లా పరిషత్, ఒంగోలు, చైర్ పర్శన్ బి. వెంకాయమ్మ గారితో కలిసి వ్యవసాయ ప్రదర్శనశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎ.ఆర్.ఎస్., లాం, ఎ.డి.ఆర్., డా॥ పి. రత్నప్రసాద్; ఎ.ఆర్.ఎస్., దర్శి అధిపతి డా॥ ఎస్. భారతి; శాస్త్రవేత్తలు, అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

## ఎఫ్.ఎమ్.సి. ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అవగాహన ఒప్పంద కార్యక్రమం

ఎఫ్.ఎమ్.సి. ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు విజ్ఞాన నాయకత్వ ఉపకార వేతనాలను దేశంలోని ఎంపిక చేసుకున్నా 8 రాష్ట్రాలలోని ముఖ్య వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ప్రారంభించారు. విద్యలో పరిశోధనలలో ఉన్నత అవకాశాలు కల్పిస్తూ వారు తమ భవిష్యత్తును వ్యవసాయ పరిశోధనలలో కొనసాగించాలని ఆశిస్తున్నారు. ఇందులో భాగంగా ఎఫ్.ఎమ్.సి. కంపెనీ మరియు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ అవగాహన ఒప్పంద పత్రాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ఎ. విష్ణువర్ధన రెడ్డి గారు మరియు ఎఫ్.ఎమ్.సి. భారతదేశ పరిశోధన మరియు అభివృద్ధి కార్యకలాపాల సంచాలకులు డా॥ ఆనంద్ కృష్ణన్ గారు మార్చుకొన్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా ఒక యం.యస్సీ మరియు ఒక పి.హెచ్.డి. విద్యార్థికి ప్రతి సంవత్సరం ఉపకార వేతనం కల్పించనుంది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు - శాస్త్రవేత్తల సలహాలు

డా॥ ఏ. మనోజ్, శాస్త్రవేత్త (విస్తరణ)
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, గుంటూరు - 522 034

**నిరంజన్, పనసభద్ర, మక్కువ, విజయనగరం జిల్లా.**

**ప్ర. మొక్కజొన్న పంట వేసి 30 రోజులైంది. కత్తెర పురుగు ఉధృతంగా ఉంది. నివారణ తెలియ జేయండి ?**

**జ.** కత్తెర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరానికి ఎమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రా. లేదా స్పైనోసాడ్ 60 మి.లీ. ఆకుసుడిలో లేదా మొవ్వు ఆకులు పూర్తిగా తడిచేటట్లు పిచికారి చేయాలి. అవసరాన్ని బట్టి 2 నుంచి 3 పర్యాయములు మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి. ఎదిగిన గొంగళి పురుగుల నివారణకు విషపు ఎర (తవుడు 10 కిలోలు + బెల్లం 2 కిలోలు + 2 లీటర్ల నీరు + 100 గ్రా. థయోడికార్బ్) తయారు చేసి సాయంత్రం వేళల్లో మొవ్వులో వేయాలి.

**పవన్ కుమార్, పెపద్రు, పొన్నూరు, గుంటూరు జిల్లా.**

**ప్ర. మినుములో ఎండు తెగులు రాకుండా అరికట్టుటకు నివారణ తెలియ జేయండి ?**

**జ.** ఈ తెగులును తట్టుకునే రకాలైన బుట్ట మినుము, ఎల్.బి.జి. 787, ఎల్.బి.జి. 402, ఎల్.బి.జి. 752 వంటి రకాలు వేసుకోవాలి. పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలి. వేసవిలో లోతు దుక్కులు చేయాలి. విత్తనశుద్ధి తప్పనిసరిగా ఆచరించాలి. విత్తే సమయంలో ఎకరానికి 80 కిలోలు చివికిన పశువుల ఎరువు + 20 కిలోల వేపపిండిలో అభివృద్ధి పరిచిన 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి అనే జీవ శిలీంద్రాన్ని భూమిలో వేసి కలియదున్నాలి.

**నారాయణ స్వామి, వెల్లటూరు, పుట్లూరు, అనంతపురం జిల్లా.**

**ప్ర. టమాటాలో ఆకులపై, కాండంపై కాయలపై మచ్చలు ఏర్పడి క్రమేణ ఎండిపోతున్నాయి. నివారణ తెలియ జేయండి ?**

**జ.** ఇవి ఆకుమాడు తెగులు లక్షణాలు, మొక్క దశలో ఎప్పుడైన ఆశించవచ్చు. తేమ, చల్లని వాతావరణంలో ఎక్కువగా ఆశిస్తుంది. నివారణకు మాంకోజెబ్ 3 గ్రా. లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా ప్రాపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 3 నుంచి 4 పర్యాయములు పిచికారి చేయాలి.

**అశోక్, కనిగిరి, ప్రకాశం జిల్లా.**

**ప్ర. మిరపలో కాయకుళ్ళు నివారణ తెలియ జేయండి ?**

**జ.** కాయకుళ్ళు నివారణకు లీటరు నీటికి ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా డైఫెన్‌కొనజోల్ 0.5 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పూత సమయంలో మరియు కాయలు పండుబారే సమయంలో పిచికారి చేయాలి. విత్తే ముందే తప్పని సరిగా విత్తన శుద్ధి చేయాలి మరియు కాయకుళ్ళు సోకిన మొక్కల నుంచి విత్తనం సేకరించరాదు.

**మల్లికార్జున, తిమ్మాపురం, ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా.**

**ప్ర. ప్రతి పంట వేసి 80 రోజులు అయ్యింది. కొద్ది రోజుల క్రితం పడిన వర్షాలకు కలుపు ఉధృతంగా పెరిగింది. నివారణ తెలియ జేయండి ?**

**జ.** వర్షాలు ఎక్కువగా ఉండి అంతర కృషి కుదరనప్పుడు ఎకరాకు లీటరు పెరాక్వాట్ 24% లేదా 2 లీటర్ల గ్లైఫోసేట్ మందును, 2 కిలోల యూరియా లేదా అమ్మోనియం సల్ఫేట్‌తో 200 లీటర్ల నీటిలో కలిపి ప్రత్తి మీద పడకుండా వరుసల మధ్య కలుపు మీద మాత్రమే పడేటట్లు గాలి ఎక్కువగా లేని సమయంలో పిచికారి చేయాలి.

**రఫి, అమరావతి, గుంటూరు జిల్లా.**

**ప్ర. ప్రత్తి వేసి 120 రోజులైంది. గులాబి రంగు పురుగును నివారించుటకు ఏ మందులు పిచికారి చేయాలి. ?**

**జ.** పురుగు ఉధృతిని బట్టి సైపర్‌మెత్రిన్ 25% ఇ.సి. 1.0 మి.లీ. లేదా లామ్డాసైహలోత్రిన్ 5.0% ఇ.సి. 1.0 మి.లీ. లేదా బైఫెన్‌త్రిన్ 10 ఇ.సి. 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి ఒకటి లేదా రెండు పర్యాయములు పిచికారి చేయాలి.

**వెంకటేశ్వర్లు, కోయవరిపాలెం, ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా.**

**ప్ర. వర్షానికి దెబ్బతిన్న మిరప పంటలో యాజమాన్య చర్యలు తెలియజేయండి ?**

**జ.** మురుగు నీటిని బయటకు పంపి, లీటరు నీటికి 10 గ్రా. యూరియా మరియు 5 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్‌ను కలిపి వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. అదనంగా ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ మరియు 200 కిలోల వేపపిండి వేయాలి. నేల

అదునుకు వచ్చినప్పుడు గొర్రుతో అంతరకృషి చేస్తే త్వరగా ఆరుతుంది. వర్షాల వల్ల ఆశించే తెగుళ్ళ నివారణకు ముందు జాగ్రత్తగా కార్బండెజిమ్ 1 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**రామకృష్ణా, కరైపల్లు, అనంతపురం జిల్లా.**

**ప్ర. వర్షాలకు శనగ పూర్తిగా కుళ్ళిపోయింది. ప్రత్యామ్నయంగా ఏ పంటలు వేసుకోవచ్చు ?**

**జ.** శనగకి ప్రత్యామ్నయంగా జొన్న, వేరుశనగ, మొక్కజొన్న, ప్రొద్దు తిరుగుడు, దనియాలు, మినుము, కుసుమ వంటి పంటలు వేసుకోవచ్చు.

**చంద్రశేఖర్, నందవరం, కర్నూలు జిల్లా.**

**ప్ర. వరి మాగాణుల్లో మినుము పంటను విత్తుటకు సరైన సమయంను తెలియ చేయగలరు ?**

**జ.** నవంబరు రెండవ పక్షం నుండి డిసెంబరు ఆఖరి వరకు వరి కోసిన మాగాణి పొలాల్లో మినుము విత్తుటకు మిక్కిలి అనువైనది.

**సుధాకర్, నాయుడుపేట, మచిలీపట్నం, కృష్ణా జిల్లా.**

**ప్ర. వరి వేసి 15 రోజులైంది. పంట తొలి దశలో ఆశించే ఉల్లికోడు కాండం తొలిచే పురుగుల నియంత్రణకు ముందు జాగ్రత్తగా ఎటువంటి చర్యలు తీసుకోవాలో వివరించండి ?**

**జ.** నాటిన 15 రోజులకు ఎకరాకు 10 కిలోలు కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలు వేసుకుంటే తొలిదశలో ఆశించే ఉల్లికోడు మరియు కాండం తొలుచే పురుగుల ఉధృతిని కొంత వరకు తగ్గించుకోవచ్చు. లింగాకర్షక బుట్టలతో పురుగు ఉధృతిని గమనించి అవసరమైతే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ట్రైకోగ్రామ పరాన్నజీవులను ఎకరాకు 20,000 చొప్పున నాటిన 30-45 రోజులలో 3 దఫాలుగా పొలంలో వదలాలి. నత్రజని ఎరువులను సిఫారసుకు మించి వేయరాదు.

**బాబు, నడికుడి, దాచేపల్లి, గుంటూరు జిల్లా.**

**ప్ర. ఎడగారు వరికి / మెట్ట వరికి అనుకూలమైన వరి రకాలను తెలియ జేయండి ?**

**జ.** ఎడగారు కాలానికి అనువైన వరి రకాలలో ఎన్.ఎల్.ఆర్. 34449, ఎన్.ఎల్.ఆర్. 3354, ఎన్.ఎల్.ఆర్. 30491, ఎన్.ఎల్.ఆర్. 40054, ఎన్.ఎల్.ఆర్. 3358, ఎన్.ఎల్.ఆర్. 40024 ముఖ్యమైనవి.

**అబ్దుల్ రహీమ్, చెప్పగిలి, కర్నూలు జిల్లా.**

**ప్ర. కంది వేసి 100 రోజులైంది. గూడు పురుగు ఉధృతంగా ఉంది. నివారణ తెలియ జేయండి ?**

**జ.** గూడు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే నివారణకు నొవాల్యురాన్ 1 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా ల్యాండా సైహలోత్రిన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లో లీటరు నీటికి కలిపి మందులు మార్చి వారం రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**పద్మరాజ్, దుర్గాల, గొల్లప్రోలు, తూర్పు గోదావరి జిల్లా.**

**ప్ర. మునగలో కాండం కుళ్ళు నివారణ తెలియ జేయండి ?**

**జ.** కాండం కుళ్ళు నివారణకు మొక్కల మొదలు వద్ద 1 గ్రా. కార్బండెజిమ్ లేదా 3 గ్రా. మాంకోజెబ్ ఒక లీటర్ల నీటికి కలిపిన ద్రావణం లేదా 1 శాతం బోర్డో మిశ్రమం గాని ముంపుగా తడపాలి. మొక్క మొదల వద్ద మురుగు నీరు నిల్వకుండ జాగ్రత్త పడాలి. ప్రతి చెట్టు మొదలలో ట్రైకోడెర్మా విరిడి కలిపిన పశువుల ఎరువును 5 కిలోల చొప్పున వేయాలి.

**లాజరు, ఒలేటివారి పాలెం, శాకవరం, ప్రకాశం జిల్లా.**

**ప్ర. రబీలో నువ్వు విత్తే సమయం మరియు అధిక దిగుబడి ఇచ్చే రకాలు తెలియ జేయండి ?**

**జ.** రబీ కాలానికి నువ్వుల పంటను డిసెంబరు 15 నుంచి జనవరి చివరి వరకు విత్తుకోవచ్చు. నువ్వులలో అధిక దిగుబడి ఇచ్చే రకాలలో ముఖ్యమైనవి. ఎలమంచలి 66, ఎలమంచిలి 17, ఎలమంచిలి 11 రకాలు.

**గిరి, పాన్యం, కర్నూలు జిల్లా.**

**ప్ర. మినుములో తలమాడు నివారణ తెలియ జేయండి ?**

**జ.** ఇది వైరస్ తెగులు తామర పురుగులు ఈ తెగులు వ్యాప్తి కారణం అవుతాయి. వీటి నివారణకు ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి ఉధృతిని బట్టి వారం రోజుల వ్యవధిలో మందులను మార్చి రెండు సార్లు పిచికారి చేయాలి.

**ప్రసాద్, మున్నంగి, కొల్లిపర, గుంటూరు జిల్లా.**

**ప్ర. పసుపు పంట వేసి 120 రోజులైంది. ఈ సమయంలో ఎటువంటి ఎరువులు వేసుకోవాలో తెలియ జేయండి ?**

**జ.** పసుపు పంటకు 120 రోజుల వయసులో 50 కిలోల యూరియా మరియు 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వంటి ఎరువులను వేయాలి. పై ఎరువులను ఆకులపై వర్షం నీటి బొట్లు, మంచు, తేమ లేనప్పుడు వేయాలి మరియు మొక్కసుడిలో పడకుండా మొక్కలకు 10 సెం.మీ. దూరంలో వేసి మట్టితో కప్పి తేలికపాటి తడి ఇవ్వాలి.

## విశ్వవిద్యాలయంలో జరిగిన కిసాన్‌మేళా కార్యక్రమాలు



@ ఆర్.ఎ.ఆర్.ఎస్., చింతపల్లి



@ ఎ.ఆర్.ఎస్., విజయనగరం



@ ఆర్.ఎ.ఆర్.ఎస్., అనకాపల్లి




@ వ్యవసాయ కళాశాల, నైరా




@ ఎ.ఆర్.ఎస్., దర్శి

RNI NO : APTEL/2012/46939 **JANUARY 2022** Postal Regd. No. GTR/82/2022-24
Date of Publication : 07-01-2022
Date of Posting 09-01-2022

# ఖరీఫ్ 2021-22 వివిధ పంటల కోత సమయంలో ముందస్తు అంచనా ధరలు.



| క్ర. సం. | పంటలు | అంచనా ధరలు (క్వి/రూ) | అంచనా ధరలు వర్తించు సమయం |
|---|---|---|---|
| 1 | మిరప | 10,000-11,500 (సాధారణ రకాలు) | ఖరీఫ్ 2021-22 పంటకోత సమయం (డిసెంబర్, 2021 & జనవరి, 2022) |
| | | 13,000-14,500 (ప్రత్యేక రకాలు) | |
| 2 | ప్రత్తి | 7,000-8,000 | |
| 3 | పసుపు | 5,400-5,800 (కాయలు) | |
| | | 5,600-6,000 (కొమ్ములు) | |
| 4 | మొక్కజొన్న | 1,750-1,900 | |
| 5 | జొన్న | 1,900-2,200 (తెల్ల రకాలు) | |
| 6 | కంది | 5,600-6,000 | |
| 7 | మినుము | 6,600-6,900 | |
| 8 | పెసర | 6,700-7,000 | |
| 9 | శనగ | 4,500-5,000 | |
| 10 | వేరుశనగ | 5,400-6,000 | |

**గమనిక :** పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో గత 16 నుండి 28 సం॥ల ధరలను విశ్లేషించి అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా, లేదా ప్రభుత్వ మధ్యంతర జోక్యం / వివిధ పథకాల వల్ల అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును. కావున భవిష్యత్‌లో పంట ధరల మార్పునకు ఈ కేంద్రం ఏవిధమైన బాధ్యత వహించదు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన చిరునామా :
ప్రధాన శాస్త్రవేత్త (ఆర్థిక శాస్త్రం) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం, లాం. సెల్ నెం. 70754 63799

ANGRAU

## ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

**లాం, గుంటూరు - 522 034**

ముద్రణ & ప్రచురణ కర్త : ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి, ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము, గుంటూరు.
ముద్రణాలయం : ప్రజాశక్తి ప్రింటర్స్ & పబ్లిషర్స్ ప్రై.లి., కృష్ణనగర్, తాడేపల్లి, గుంటూరు జిల్లా.